# ANDHRA PRADESH
# LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

**OFFICIAL REPORT**

బుధవారము, సెప్టెంబరు 28, 2005

12 వ శా. స. IV స. వాల్యూం -- VII నంబరు --1

శక సంవత్సరము - 1927, అశ్విని - 6

## WEDNESDAY, THE 28th SEPTEMBER, 2005

**12 L.A. IV S. VOL-- VII No. - 1**

**6 - Asvin , 1927 - S.E.**

#


శాసనసభ సచివాలయము

పబ్లిక్ గార్డెన్స్

హైదరాబాదు - 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS**
**HYDERABAD**
**500 004.**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీ కె. ఆర్. సురేష్ రెడ్డి |
| అధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీ బి. వేదవ్యాస్ |
| | | డా. జి. కుతూహలమ్మ |
| | | శ్రీ ఎ. గోవింద నాయక్ |
| కార్యదర్శి | : | శ్రీ కె. తుల్జానంద్ సింగ్ |
| సంయుక్త కార్యదర్శి | : | శ్రీ షాబాజ్‌ఖాన్ |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ ఎస్. వెంకటేష్ |
| | | శ్రీ ఎస్. రాజ సదారామ్ |
| | | శ్రీ యు. జగదీశ్వర్ |
| | | శ్రీ ఎన్. అంజయ్య |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ డి.శివరావు |
| | | శ్రీ ఎం. పాండురంగాచార్య |
| | | శ్రీ పి. సీతారాములు |
| | | శ్రీ కె.ఎ.నర్సింహరాజు |
| | | శ్రీ డి. నర్సింహులు |
| | | శ్రీ పి. సత్యనారాయణ |
| | | శ్రీ ఎ. అశోక్‌రావు |
| | | శ్రీ కె. తులసీరాం |
| | | శ్రీ డి. సత్యనారాయణ |
| | | శ్రీ ఎ. రామిరెడ్డి |
| | | శ్రీ పి. సుదర్శన్ రెడ్డి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీమతి వి. గిరిజా సుందరి |

--------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు
అధికార నివేదిక

( పన్నెండవ శాసనసభ)
( నాల్గవ సమావేశము : మొదటి రోజు )
బుధవారము, సెప్టెంబరు **28, 2005**
సభ ఉ. గం. **10.00** లకు ప్రారంభమైనది
( గౌ. సభాపతి అధ్యక్షస్థానములో వున్నారు )

----------

## విషయ సూచిక

1. సంతాప ప్రతిపాదన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ సభ్యుడు శ్రీ సి. నర్సిరెడ్డి గారి మృతి పట్ల

--------

(జాతీయ గీతమైన 'జనగణమణ'తో సభ ప్రారంభమైనది )

## సంతాప ప్రతిపాదన

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ సభ్యుడు శ్రీ సి. నర్సిరెడ్డి గారి మృతి పట్ల

మిస్టర్ స్పీకర్: కండోలెన్స్ మోషన్ ముఖ్యమంత్రిగారు మూవ్ చేస్తారు.

* డా.వై.ఎస్. రాజశేఖరరెడ్డి: " ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ్యులు శ్రీ చిట్టెం నర్సిరెడ్డిగారి మృతిపట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియ చేస్తున్నది".

మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకులు శ్రీ చిట్టెం నర్సిరెడ్డిగారు మక్తల్ నియోజక వర్గం నుండి, 1981-85, 1985-89, 2004 సంవత్సరాల్లో జరిగిన సాధారణ ఎన్నికల్లో రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. అంతకుముందు 1970-76లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విధాన పరిషత్తుకు సభ్యుడిగా పని చేశారు. 30 సంవత్సరాల వయస్సులో ధన్వాడ గ్రామ పంచాయితీకి ఎన్నికయ్యారు. ఆ గ్రామానికి అనేక విధాలుగా ఇతోధిక సేవ చేశారు. 1959-60లో ధన్వాడ పంచాయితీ సమితి అధ్యక్షుడిగా, 1964-70 మక్తల్ పంచాయితీ సమితి అధ్యక్షుడిగా పని చేశారు. ఆయన స్వాతంత్ర్య సమయయోధుడుకూడా. నిజాం కాలంలో ప్రజా వ్యతిరేక ఉద్యమాలలో జైలు పాలయ్యారు. అటువంటి స్వాతంత్ర్య సమర యోధుడిని, 76 సంవత్సరాల వయస్సు గల చిట్టెం నర్సిరెడ్డిగారిని స్వాతంత్ర్య దినోత్సవం నాడు దేశం అంతా స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటూ ఉంటే ఆగస్టు 15వ తేదీన తీవ్రవాదం పొట్టున పెట్టుకోవడం చాలా గర్హనీయమైనది. వారు ఏ ఒక్కరికయినా అపకారం చేశారని అన్నవారు లేరు.

వారిని నేను 1971 నుండి చూస్తున్నాను. అప్పటి నుండి కూడా ఎవరూ నర్సిరెడ్డిగారి వల్ల అన్యాయం జరిగిందని అనలేదు. అలా అన్న వారు నాకు ఎవరూ కనపడలేదు. ఆయనను అజాత శత్రువు అనడం ఏమాత్రమూ అతిశయోక్తి కాదు. మాజీ శాసనసభ్యుడిగా ఉన్నా, శాసనసభ్యుడిగా ఉన్నా పూర్తిగా నిగర్వి. ఏదైనా మాట చెప్పవలసి వస్తే మొహమాటం లేకుండా నిర్మొహమాటంగా మాట్లాడే వారు. అటువంటి పెద్ద మనిషిని తీవ్రవాదులు ఏ విధమైన కారణం లేకుండా కేవలం ఏదో ఒక విధంగా ఈ శాసనసభలో ఒక సభ్యుడిని చంపితే దాని వల్ల మరింత ఎక్కువగా ప్రాచుర్యం వస్తుందనే విధంగా చేశారు. లేకుంటే వారికి సంబంధించిన ఉద్యమం, వారు అనుకుంటున్న ఉద్యమ కార్యక్రమం కొంత నిర్వీర్యం అవుతూ ఉంటే, ఆ విధంగా కాకుండా ఉండడం కోసం చేసిన పని అనిపిస్తుంది తప్ప మరొకటి కాదు. ఎన్ని రకాలుగా ఆలోచన చేసినా వీరిని చంపవలసిన అవసరం ఏ చోటా లేదు. ఆయనతోబాటు ఆయన కుమారుడు, వారితోబాటు మరో 9 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఉన్నారు. చనిపోయిన వారు 11 మంది అయితే గాయపడిన వారు చాలా మంది ఉన్నారు. ఆర్.డి.ఓ., గారు తీవ్రంగా గాయపడ్డారు. మరొక ఇద్దరూ అలాగే గాయపడ్డారు.

ఈ విధమైన కార్యక్రమాలవల్ల తీవ్రవాదులు, వారు చేస్తున్న పనులు, ప్రజలలో అనుమానాన్ని చొరగొనడానికి ఉపయోగపడతాయనేది మనందరం ఆలోచన చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా నర్సిరెడ్డిగారు ఉన్న ప్రాంతాలలో తీవ్రవాదం లేదు. అది సాఫ్ట్ టార్గెట్‌తో జరిగింది. ఆయన వెంట ఇద్దరు గన్‌మెన్‌లు తప్ప రక్షణ కూడా ఉండదు. మక్తల్ పోలీస్ స్టేషన్ కూడా వెపన్స్ లేని పోలీస్ స్టేషన్. ఏమైనా చేసినా, తప్పించుకోవడానికి ఆస్కారం ఉందని సాఫ్ట్ టార్గెట్‌తో వారిని చంపివేశారు.

---

* An asterisk before the name indicates confirmation by the Member.

ఈ ఘటనను ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించవలసినదే. ప్రతి ఒక్క సభ్య సమాజంలో, ప్రతి ఒక్కరూ చాలా గట్టిగా ఆలోచన చేయాలి. ఇటువంటి తీవ్రవాద చర్యలను పూర్తిగా ఖండించి ప్రజాస్వామ్యం అంటే నమ్మకం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ విషయంలో ఒక త్రాటి మీద నిలబడవలసిన అవసరం ఉంది. మనలో మనకు రాజకీయ తేడాలు ఉండవచ్చు. ఇటువంటి చర్యలు జరిగినప్పుడు, అందరూ ముక్త కంఠంతో ఖండించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఏ ఒక్కరైనా కూడా మానవ హక్కుల కోసం పోరాడడంలో ఏ మాత్రం తప్పు కాదు. కానీ ఆయన చని పోయిన తరువాత మేము మానవ హక్కుల కోసం పోరాడుతున్నాము అంటున్న వారు, అందులోనూ ' విరసం ' అనే ఒక ఆర్గనైజేషన్, విప్లవ రచయితల సంఘం లీడర్ మాట్లాడిన మాటలు వింటూ ఉంటే, సభ్యసమాజం సిగ్గుతో తలవంచుకునేలా ఉంది. కాబట్టి నేను, చాలా విషయాల్లోకి పోదలచుకోలేదు.

గడచిన సంవత్సరం రోజులుగా ఈ సమస్యకి సంబంధించి తీవ్రవాదులను నెగోసియేషన్ టేబుల్ మీద తీసుకురావడం, వారితో చర్చ చేయడానికి మేము చేసిన ప్రయత్నం తెలిసిందే. సమాజంలో అణగారిన వారికి ఏ విధమైన మేలు చేయాలనే కార్యక్రమం, తప్పకుండా మేము చేస్తామని వారికి హామీ ఇవ్వడం, ఆ ప్రయత్నంలోనే భూముల పంపిణీ కార్యక్రమం, కమ్యూనికేషన్ డెవలప్‌మెంట్ మొదలైన కార్యక్రమాలు జరిగాయి. కానీ తీవ్రవాదులు తుపాకులు వదిలే విషయంలో ఏ మాత్రమూ రాజీ చూప లేదు. మేము తుపాకీ పట్టామనే పద్ధతిలో ఉన్నారు. శాంతికి సంబంధించి, నాలుగు కాలాలపాటు శాంతి నిలబడాలంటే, అందు కోసం ఒక ప్రైవేట్ వ్యక్తి, ప్రైవేట్ సంస్థ తుపాకులు పట్టకుండా శాశ్వతమైన శాంతి రావాలనే నిర్ణయంతో ప్రభుత్వం కొంత గట్టిగా వ్యవహరిస్తే, వారు యూనీలేటరల్‌గా చర్చల కార్యక్రమం పూర్తిగా మానివేసి ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలను మొదలుపెట్టే పరిస్థితి మనందరం చూసాము.
ఉ.10.10

నేను ఎక్కువ వివరాల్లోకి వెళ్లడం లేదు. నర్సిరెడ్డి గారు అందరికీ అభిమాన పాత్రుడు. అందరి ప్రేమాభిమానాలు చూరగొన్నారు. 15 సంవత్సరాలు కౌన్సిల్‌లో, 12 సంవత్సరాలు శాసనసభలో ఆయన ఉన్నారు. అందరితో సన్నిహిత సంబంధాలు ఉన్న ఆయనను తీవ్రవాదులు హత్య చేసిన విషయాన్ని మరోమారు గట్టిగా ఖండిస్తున్నాను. సభలో ఉన్న అన్ని పార్టీల వారు ముక్త కం ఠంతో ఖండించాలని కోరుతున్నాను. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గత శాసన సభ సమావేశాల్లో రాగ్యానాయక్ గారు తీవ్రవాదుల చేతుల్లో చంపబడితే సభ ముక్త కంఠంతో ఖండించింది. అంతే కాకుండా, ఆ రోజు మేము ప్రతిపక్షంలో ఉన్నాము. మా పార్టీ శాసనసభ్యుడైన రాగ్యానాయక్ గారు హత్య గావించబడితే, ఆనాడు అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం, రాగ్యానాయక్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో యునానిమస్‌గా గెలిపించిన విషయాన్ని గుర్తు చేస్తున్నాను. అదే విధంగా, తీవ్రవాదుల చేతిలో చనిపోయిన ఈయన విషయంలో కూడా అదే ఆనవాయితీని కొనసాగించాలి. జిల్లా పరిషత్ లో, అసెంబ్లీ సెగ్మెంట్‌లో, జడ్పిటిసి లు చంపబడితే అందరం కలిసి ప్రజాస్వామ్యంపై నమ్మకం పెట్టుకొని ఎన్నికను చేసుకొంటున్న విషయాన్ని మీ దృష్టికి తెస్తున్నాను. రేపు జరుగబోయే ఎన్నిక గురించి ఇప్పుడే మాట్లాడడం భావ్యం కాకపోయినా, ఇంతకు ముందు ఉన్న పాలసీనే కొనసాగించడానికి గాను, మిగిలిన అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ముందుకు రావాలి. నర్సిరెడ్డి గారి హత్యను ఖండించి, ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే కార్యక్రమంలో అందరం ముందుకు వెళ్లాలని కోరుతున్నాను. అదృష్టవశాత్తు నర్సిరెడ్డి గారి కూతురు మన శాసనసభలో సభ్యురాలిగా ఉన్నారు. ఆమెను ధైర్యంగా ఉండి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పమని నేను ఆ రోజునే చెప్పాను. భగవంతుడు నర్సిరెడ్డి గారి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకొని, సహకరించాలని కోరుతున్నాను. నర్సిరెడ్డి గారి ఆత్మకు భగవంతుడు శాంతిని చేకూర్చాలని కోరుతున్నాను.

శ్రీ ఎన్. చంద్రబాబునాయుడు(కుప్పం) :- అధ్యక్షా, అగస్ట్ 15వ తేదీన స్వాతంత్ర్యదినోత్సవ సందర్భంగా, కొన్ని ప్రారంభోత్సవాల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ప్యానల్ స్పీకర్ అయిన శ్రీ సి.నర్సిరెడ్డి గారు పాల్గొంటుండగా, తీవ్రవాదులుదాడి

చేయడంలో ఆయన, ఆయన కుమారుడు, మరో 9 మంది చనిపోవడం జరిగింది. ఈ సంఘటనను మా పార్టీ తరఫున నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. నర్సిరెడ్డి గారు ఒక రైతు కుటుంబంలో పుట్టి రాజకీయాల్లోకి వచ్చారు. 20.6.1929 లో జన్మించి మెట్రిక్యులేషన్ వరకు చదివారు. ఆయన అంచెలంచెలుగా రాజకీయాల్లో ఎదిగారు. ఆయన కాంగ్రెస్ పార్టీ, కాంగ్రేసేతర పార్టీలు, జనతా పార్టీలో కూడా ఉండడం జరిగింది. ముక్కుసూటిగా మాట్లాడుతూ, విలువలతో కూడిన వ్యక్తిత్వం ఆయనదని తెలియజేస్తున్నాను. ఆయన నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో చక్కని పాత్రను పోషించారు. స్వాతంత్ర్యం వచ్చిన మరుసటి సంవత్సరం నుండే ఆయన క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. తొలుత ధన్వాడ సర్పంచ్‌గా, 1959-64 మధ్య కాలంలో ధన్వాడ పంచాయితి ప్రెసిడెంట్‌గా, 1964-70 మధ్యలో మక్తల్ పంచాయితి ప్రెసిడెంట్‌గా వ్యవహరించారు. 1979వ సంవత్సరంలో జిల్లా సహకారపరపతి బ్యాంకు అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. 1977లో జనతాపార్టీ తరఫున ఎమ్.ఎల్.సి.గా, అనంతరం 1985-89 వరకు రెండు పర్యాయాలు, 2004లో మరోమారు ఎమ్.ఎల్.ఎ.గా మొత్తం మూడు పర్యాయాలు శాసనసభకు ఎన్నిక కావడం జరిగింది. ఆయన ఎటువంటి వివాదాల జోలికి వెళ్లే వారు కాదు. మృదుస్వభావి. ఆయన ప్రజాస్వామ్యాన్ని కాపాడడాని ఎనలేని కృషి చేశారు. ఆనాడు ఆగస్టు మాసంలో తెలుగుదేశం పార్టీలో సంక్షోభం వచ్చినప్పుడు 30రోజులు ఆయన మాతో ఉండి ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి ఎనలేని కృషి చేశారు. ఆయనతో నాకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. హౌస్‌లో కూడా ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తి. ప్యానల్ స్పీకర్‌గా నిర్మొహమాటంగా ఉండి, ఎంతో కఠినంగా వ్యవహరించినా, సభలో అందరికి సమానావకాశాలు ఇస్తూ, సభని హుందాగా ముందుకు నడిపిన వ్యక్తి ఆయన. 75 సంవత్సరా వయసులో కూడా క్రియాశీ ల రాజకీయాలను ఆయన ముందుకు తీసుకు వెళ్లారు. 75 సంవతసరాల వయస్సులో కూడా ఆయన ఎంతో ఆరోగ్యంగా ఉన్నారు. అటువంటి వ్యక్తి ఈ రోజు మన మధ్యన లేకపోవడం దురదృష్టకరం. విచారించాల్సిన విషయం అని తెలియజేస్తున్నాను. ఆయన అనేక కమిటీల్లో పనిచేశారు. ఏ విషయంపైనైనా నిర్మొహమాటంగా మాట్లాడిన వ్యక్తి ఆయన. శాసనసభలో మంత్రిగా, ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు నేను చూశాను. ఆయన అజాత శత్రువు. ఎవరికి చెడు చేయని వ్యక్తి. అటువంటి వ్యక్తి తీవ్రవాదుల చేతుల్లో చనిపోవడం చాలా బాధాకరమైన విషయం. ఆయన ఆత్మకి శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు తెలుగుదేశం పార్టీ తరఫన నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

ముఖ్యమంత్రి గారు ఒక విషయాన్ని ప్రస్తావించారు. రాగ్యానాయక్ విషయంలో తెలుగుదేశం పార్టి ముందుకు వచ్చిన విధంగానే, నర్సిరెడ్డి గారి విషయంలొ కూడా ముందుకు రావాలని కోరారు. ఆరోజున సహకరించాము. నేడు కూడా తెలుగుదేశం పార్టీ తరఫున సహకరించడానికి సిద్ధంగా ఉన్నాము. అక్కడ పోటీ లేకుండా ఉంటే బాగుంటుంది. ఆ విధంగా అందరూ ఒప్పుకొంటే, అందరూ ఒప్పుకొంటే తెలుగుదేశం పార్టీ కూడా పూర్తిగా సహకరిస్తుందని తెలియజేస్తున్నాను.

నర్సిరెడ్డి గారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాడ సానుభూతిని తెలియజేస్తున్నాను.

డా. జి. విజయరామారావు (ఘనాపూర్):- అధ్యక్షా, సీనియర్ శాసనసభ్యుడు శ్రీ నర్సిరెడ్డి గారి హత్యను టి.ఆర్.ఎస్. పార్టీ ఖండిస్తున్నది. ప్రజాప్రాతినిధ్యంలో మొదటి మెట్టు అయిన సర్పంచ్ స్థాయి నుండి, శాసన మండలి సభ్యునిగా, శాసన సభ సభ్యునిగా అనేక సంవత్సరాలు ప్రజా జీవితంలో నిరాడంబరంగా, ఆదర్శవతముగా మెలిగిన వ్యక్తిని, గత ఆగస్ట్ 15వ తేదీన హత్య చేయడం చాలా విచారించదగిన విషయం. ప్రజాస్వామ్యంలో హింసకి, ప్రతిహింసకు తావు లేదు. ప్రజాస్వామ్యంలో అనేకమైన కఠిన సమస్యలకు పరిష్కారాన్ని చర్చల ద్వారా సాధించగల్గుతామని తెలియజేస్తున్నాను. నర్సిరెడ్డిగారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నాను.

నర్సిరెడ్డి గారు కరడు గట్టిన తెలంగాణా వాది. ఆయన తెలంగాణా రాష్ట్ర సమితి ఏర్పడక ముందే 48 మంది శాసనసభ్యులను ఢిల్లీ తీసుకువెళ్లి, కాంగ్రెస్ అధిష్టాన వర్గం వద్ద తెలంగాణా రాష్ట్ర అవసరాన్ని నొక్కి చెప్పారు. ఆయన కలలను

నిజం చేయాలంటే, తెలంగాణా సాధన కోసం కృషి చేయాలని తెలియజేస్తున్నాను. ఇదే వారి ఆత్మకు నిజమైన నివాళిగా తెలంగాణా రాష్ట్ర సమితి తరఫున తెలియజేస్తున్నాను.

శ్రీ నోముల నర్సింహయ్య(నక్రేకల్) :-అధ్యక్షా, దేశానికి విముక్తి లభించి, స్వాతంత్ర్యం వచ్చిన రోజునే చిట్టెం నర్సిరెడ్డిగారిని తీవ్రవాదులు మట్టు పెట్టడం, వారితోబాటు వారి కుమారుణ్ణి, మరో 8 మందిని కాల్చి చంపడం అన్నది తీవ్రమైన, హేయమైన చర్యగా, సభ్య సమాజం సిగ్గుతో తల వంచుకొనే చర్యగా మేము భావిస్తున్నాము.
ఉ.10.20

ఏది ఏమైనా నర్సి రెడ్డి గారు నేను ఎరిగిన మేరకు తమరు ఉన్న స్థానంలో ప్యానల్ స్పీకరు గా ఉండి నిర్భయంగా, నిష్కర్షగా విషయాన్ని వాస్తవాలను నొక్కి చెప్పిన వ్యక్తి . రాజకీయ జీవితంలో కూడా ఆ రకమైనటువంటి పద్ధతులను కొనసాగించినవారిగా మేము భావిస్తున్నాం. వ్యక్తి గత హింసా వాదం అన్నది ప్రజాస్వామ్య శక్తులకు , ప్రజా తంత్ర ఉద్యమాలకు, వామ పక్ష ఉద్యమాలకు ఒక గొడ్డలి పెట్టులాంటిదని మేము భావిస్తున్నాం . అదే కాకుండా తీవ్ర వాదం మాతో విడివడిందని మా ప్రముఖ నాయకులు బసవ పున్నయ్య గారు చెప్పారు. వారు తుపాకి గొట్టం ద్వారా వచ్చేది పొగ మాత్రమే . దానివల్ల రాజ్యం రాదు . అందులో పేదల రాజ్యం రాదు . పేదలు బాధలు పోయే రాజ్యం రాదని వారు చెప్పారు. తీవ్ర వాదంతో రాజ్యం ముక్కలు చెక్కలు అవడమే కాక అనేక రకాల ఇబ్బందులకు , ప్రజా తంత్ర ఉద్యమాలకు, ప్రజలను వారు గురి చేస్తారని మా నాయకులు చెప్పారు. ఈ పరిస్థితులను మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. ఏది ఏమైనా తమ ఉనికి కోసం వారు ఆ విధంగా కాల్చి చంపడం అన్నది హేయమైన చర్యగా మేము భావిస్తున్నాం .

ఈ రోజున ఉన్నటువంటి అనేక రకాల పరిస్థితులను ఒకసారి మనం గమనిస్తే ఈ తీవ్ర వాదంలో పుట్టిన నక్సల్ బరీ వాదం ఈ రోజు పూర్తిగా లేకుండా పోయిన పరిస్థితి ఉంది. అసలు తీవ్ర వాదానికి కారణం గుర్తించాలి. దానిని లా అండ్ ఆర్డరు సమస్యగా చూడవలసిన అవసరం లేదని మాకున్న అభిప్రాయం . దీనిని సాంఘిక, రాజకీయ అంశంగా మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే, తీవ్ర వాదం అనేది లేకుండా చేయడానికి అవకాశం ఉందని మా వైపు నుంచి భావిస్తున్నాము. ఏది ఏమైనా ఈ రోజు ఎక్కడ హింస జరిగినా, ఏ విధమైన అరాచకాలు జరిగినా అలాంటి ఘటనలను ఖండించవలసిన అవసరం ఉంది. ప్రజాస్వామ్య వాదం ఆ రకమైన ఆలోచలతో ఉండాలి. ఆ విధంగా అరాచకాలను వడగట్టే విధంగా ఉండాలని మా అభిప్రాయం . అలాంటి ఘటనలను ఖచ్చితంగా, ఏ విధమైన ఏమరపాటు లేకుండా మేము ఖండిస్తున్నాం .

ఎవరు ఎన్ని చెప్పినా ఈ తీవ్ర వాదానికి అనేక రకాల శక్తుల ఊతం ఇస్తున్న పరిస్థితి ఈ రోజు ఉంది. పైన పటారంగా లోన లొటారంగా ఉంటూ అనేక రకాలుగా అంటే, లోపల ఒకరకంగా, బయట ఒక రకంగా పని చేస్తున్న శక్తులు ఈనాడు చాలా ఉన్నాయి. ఈ రకంగా ఉంటే ప్రజాస్వామ్య హక్కులను , ప్రజాస్వామ్యాన్ని రక్షించడం చాలా బాధాకరంగా ఉంటుంది . ఏ విధంగానూ దీనిని సరి చేయలేని పరిస్థితి ఉంది. ఏది ఏమైనా , నర్సి రెడ్డి గారి మరణానికి వారం రోజుల ముందు ఎమ్.ఆర్.పి.ఎస్ అఖిల పక్ష రిప్రెజెంటేషన్‌లో మాతోబాటు వారు వచ్చారు. వచ్చి రెండు రోజులు మాతో ఉన్నారు. అనేక విషయాలు మాట్లాడారు. ఇది పెద్ద దుర్ఘటన. ఈ విధంగా, ఇలాంటి దుర్ఘటన ఇలా జరుగుతుందని మేమెప్పుడూ ఊహించలేదు. ఆయన కూడా ఊహించలేదు. ఎవరూ ఊహించలేదు. బాధాకరమైన విషయమేమంటే పత్రికలలో వచ్చిన వార్త పరిశీలన చేసి చూస్తే , అతని వద్ద ఉన్నటువంటి సహాయకుడే పూర్తి వివరాలు అందించారని తెలుస్తుంది. అలాంటి వార్త వచ్చింది. అదే నిజమైతే ఎట్టి పరిస్థితులలో దానిని క్షమించరాదు. వాస్తవాలను వెలికి తీసి దాని వెనుక ఏమి ఉందో తెలుసుకుని, ఆ శక్తుల గురించి ఆలోచించవలసిందిగా మేము తెలియజేస్తున్నాము.

నర్సి రెడ్డి గారి మృతి పట్ల సి.పి.ఐ – ఎమ్ పార్టీ తరఫున మా ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేస్తున్నాము. వారి కుటుంబానికి మా సానుభూతిని తెలియజేస్తున్నాము.

శ్రీ చాడ వెంకట రెడ్డి (ఇందుర్తి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో , వాటి ప్రారంభోత్సవ కార్యక్రమాలలో పాల్గొంటున్నటువంటి నర్సి రెడ్డి గారు దారుణమైన హత్య వార్తను నేను, ఎమ్. సత్య నారాయణ రావు గారు కరీంనగర్‌లో తెలుగు మహిళా ప్రాంగణంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ఉన్న సందర్భంలో తెలుసుకుని దిగ్భ్రాంతికి గురయ్యాం. ఈ హత్య చాలా దారుణమైనటువంటిది. మావోయిస్టు నక్సలైట్స్ , వారు వారి సిద్ధాంతాలను గాలికి వదలి వ్యక్తి గత హింసే ప్రధానంగా ఎంచుకుని ఇలాంటి హత్యలకు పాల్పడటం గురించి మేము ఆ మరుక్షణమే తీవ్రంగా ఖండించడం జరిగింది. నర్సిరెడ్డి గారే కాదు, వారి కుమారుడు, మరి 9 మంది కూడా హత్య కావించబడ్డారు. అంటే ఇది ఒక విధంగా టెర్రరిస్టు చర్యల మరపించేటువంటి పద్ధతి . ఈ విధంగా దారుణానికి ఒడిగట్టడం అన్నది సభ్య సమాజం సిగ్గుతో తలవంచుకునే పరిస్థితిగా దాపురించింది. ప్రధానంగా నర్సి రెడ్డి గారు రైతుకుటుంబంలో జన్మించారు. 76 సంవత్సరాల వయసు కలిగిన వారు ఆయన. వారు సర్పంచ్ పదవి నుంచి అనేక పదవులను అనుభవించారు. ఆయన ప్రజలలో ఉండి, ప్రజల మనసులలో గుర్తింపు పొందారు. వారు నిర్మొహమాటంగా తన భావాలను వెలిబుచ్చే వారు. దానిని మనం శాసన సభలో కూడా స్వయంగా చూశాము. ప్యానల్ స్పీకర్‌గా వారు ఉన్నప్పుడు ఆయన సభలో సభ్యులను నిర్మొహమాటంగా, మందలించడం, మాట్లాడటం చేసేవారు. ఆ విధంగా వారు సభను సజావుగా నడపేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో నేను ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. అలాంటి నర్సి రెడ్డి గారు ఇప్పుడు మనలో లేకపోవడం, మనని విడిపోవడం బాధాకరమైన విషయం . వారు భౌతికంగా మనలో లేకపోవడం చాలా బాధాకరం. వ్యక్తి గతంగా వారితో నాకు పన్నెండవ శాసన సభలోనే పరిచయం అయింది. వారితో కొద్ది పాటి పరిచయంలోనే ఒక మంచి శ్రేయోభిలాషిగా, మంచి స్నేహితుడిగా ఉన్నారు. ఆ విధంగా ఆయన మాట్లాడిన అనేక విషయాలను , మాటలను నేను మరచి పోలేను.

ఈ రోజు వ్యక్తి గత హింసా వాదం ప్రబలిన తరుణంలో ప్రభుత్వం నిషేధం విధించినప్పటికీ సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారానికి దోహదం చేయకుండా, వాటిని పరిష్కారం చేయకుండా ఈ హింసా వాదాన్ని అణచాలని నేను ప్రత్యేకంగా తెలియజేస్తున్నాను. మావోయిస్టు నక్సల్స్ చర్చలకు వచ్చి ప్రభుత్వంతో మాట్లాడిన తర్వాత కూడా, తిరిగి రెండవ దఫా చర్చలకు విఘాతం కలగడం, దానితో ఇప్పుడు ఇలాంటి సంఘటనలు, నర్సిరెడ్డి గారి లాంటి వారిని వారు హత్య చేయడం, మట్టుపెట్టడం ఇప్పుడు ఇంత అప్రజాస్వామ్యం ఏమిటని, ఇంత అప్రజాస్వామ్యమా అని మేము భావిస్తున్నాం . అలాగే నక్సలైట్స్ వ్యతిరేక సంస్థల పట్ల పరోక్షంగా నర్సా కోబ్రాలు, నల్లమల కోబ్రాలు అంటూ రెండు అంచెలుగా విభజనలు జరిగాయి. ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగడం రాష్ట్ర శాంతి భద్రతలకు భంగం కలిగించినటువంటి పరిస్థితి ఈనాడు ఏర్పడుతున్నది. కాబట్టి, దీనిని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవలసిన అవసరం ఉందని నేను భావిస్తున్నాను. మావోయిస్టు నక్సలైట్స్ దాడులు ఈ వ్యవస్థపైన నమ్మకం లేదు అన్న నెపంతో గెరిల్లా పోరాట విధానాన్ని ఎంచుకోవడం జరిగింది. చట్టం పరిధిలోనే పని చేస్తున్నామని చెబుతున్న పోలీసులు, వారు చట్టాలను పూర్తిగా తమ చెప్పు చేతల్లోకి తీసుకుని బూటకపు ఎన్‌కౌంటర్లు చేయడం ద్వారా, చేస్తున్న దురాగతాలు, దాని పట్ల చూసీ చూడని వైఖరిని ప్రభుత్వం అవలంభించడాన్ని మా పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది. శ్రీ నర్సి రెడ్డి గారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి కూడా మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ మా సిపిఐ పార్టీ తరఫున సెలవు తీసుకుంటున్నాను.

**అక్బరుద్దీన్ ఒవైసీ ( ఉర్దూ )**

Akbaruddin Owaisi(Chandrayanagutta)

جناب اکبر الدین اویسی - محترم اسپیکر صاحب سی نرسی ریڈی صاحب آج ہمارے درمیان میں نہیں ہے - ایک قابل کسان کے بیٹے کی حیثیت سے gross root level پر اپنی سیاسی زندگی کا آغاز کیا تھا - وہ سب سے پہلے سرپنچ منتخب ہوئے - وہ ایک قدیم سیاسی لیڈر تھے - وہ عوام کی بے حد خدمت کئے تھے اس لئے انھیں عوام میں مقبولیت حاصل تھی - عوام نے انھیں کونسل اور اسمبلی کا رکن منتخب کئے تھے - وہ ایک بزرگ قائد تھے - وہ تقریباً پندرہ سال تک اس ایوان کے رکن تھے وہ عوام کی خدمت کرتے رہے - ان کے ساتھ میرے اچھے تعلقات تھے چند واقعات مجھے یاد ہے - انھیں ہر پچھڑے ہوئے علاقوں کے بارے میں بہت فکر رہتی تھی - تلنگانہ ایک پسماندہ علاقہ ہے یہ ایک غیر ترقی یافتہ علاقہ ہے اس کی ترقی کیلئے وہ بہت جستجو کرتے تھے - گذشتہ بجٹ سیشن میں اس ایوان میں گرگلانی رپورٹ پر مباحث ہوئے تھے اس مباحث میں وہ میری رہنمائی کی تھی - تلنگانہ کو ترقی دلانے کیلئے وہ بہت جستجو کرتے تھے - مجھے یہ دیکھ کر بہت حیرت ہوتی تھی - اسپیکر صاحب آپ کی جگہ جب وہ آپ کی کرسی پر بیٹھتے تو اس ایوان کی کاروائی خوش اسلوبی کے ساتھ چلانے کی کوشش کرتے تھے - بہت اچھی بات یہ تھی کہ کرسی کی قدر، اس کے وقار اور اس مقام کی عزت کرنے کیلئے بارہا اس ایوان کے اراکین کو ترغیب دیتے تھے - اور یہ بھی کہتے تھے کہ میری عزت نہیں بلکہ اس صدارت کی کرسی پر جو بیٹھیں اس کی عزت کرنا چاہئے - وہ ایک اچھے قائد تھے - تلنگانہ کی عوام ایک اچھے رہنما سے محروم ہوئی ہے اور تلنگانہ کے عوام کیلئے ناقابل تلافی نقصان ہوا ہے - شاید یہ ایوان میں کبھی پورا نہ ہوگا - آج وہ اس ایوان میں موجود نہیں ہے - مجلس اتحاد المسلمین پارٹی کی جانب سے میں یہ کہنا چاہتا ہوں کہ سی نرسی ریڈی صاحب کے اس بہیمانہ قتل پر مذمت کرتی ہے - اور افسوس کا اظہار بھی کرتی ہے - ساتھ ہی ساتھ یہ کہنا بھی چاہتا ہوں کہ ماؤسٹوں کی طرف سے ریاست آندھرا پردیش میں تشدد کا رجحان چل رہا ہے اس کی وجوہات پر بھی ضرور غور کرنا چاہئے - تلگودیشم کے نوسالہ دور میں تقریباً 3500 لوگوں کی جانیں گئیں اسمیں سیاسی لیڈرس، عام آدمی اور پولیس والوں کے علاوہ ماؤسٹ بھی اسمیں شامل ہیں - اس تشدد کو ختم کرنے کیلئے اس پر غور کرنا چاہئے - کانگریس پارٹی اقتدار میں آنے کے بعد جو بھی اقدامات کئے ہیں وہ قابل قبول ہیں - آخر یہ تشدد کب ختم ہوگا - اس تشدد میں ہزاروں لوگوں کی جانیں گئی ہیں - کئی لڑکے یتیم ہوئے ہیں کئی عورتیں بیوائیں بن گئی ہیں - کئی لوگ بے گھر ہو گئے ہیں - یہ تشدد ختم ہونا چاہئے - حکومت زبردست صبر کا مظاہرہ کیا ہے - ماؤسٹوں سے بات چیت کی - میں حکومت سے درخواست کرتا ہوں کہ جو بات چیت ختم ہو گئی ہے اس کو دوبارہ آغاز کیا جائے - ریاست کو پرامن فضاء میں تبدیل کیا جائے - ان کو ونٹرس کو ختم کرنا چاہئے - میں یہ بات اس لئے کہہ رہا ہوں کہ گولی کا جواب گولی سے نہیں ہو سکتا - جمہوریت میں تشدد کی کوئی جگہ نہیں ہے اس کو ختم کرنا چاہئے - confidence building measures کے ذریعہ بات چیت کو دوبارہ آغاز کرنا چاہئے - اور ان کو ونٹر کو بند کر دینا چاہئے - مسٹر ورا ورا راؤ کو جو گرفتار کیا گیا ہے اور ان پر جو مقدمات ڈالے گئے ہیں ان مقدمات کو واپس لے لیا جائے اور انھیں فوری رہا کر دیا جائے - ویرسم پر جو پابندی لگادی گئی ہے اس پابندی کو ختم کر دیا جائے - ایک confidence پیدا کریں اور تشدد کا خاتمہ ہونا چاہئے - مجلس اتحاد المسلمین کی جانب سے میں یہ کہنا چاہتا ہوں کہ سی نرسی ریڈی صاحب کے افراد خاندان کے غم میں ہم بھی برابر کے شریک ہیں - ہماری پارٹی اس قتل پر مذمت کرتی ہے - اور اللہ تعالی سے دعا کرتے ہیں کہ سی نرسی ریڈی صاحب کے افراد خاندان کو صبر جمیل عطا فرمائیں -

ఉ.10.30

శ్రీ ఎమ్. సత్యనారాయణరావు: అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానంతో మరియు ఇతర గౌరవసభ్యులు మాట్లాడిన మాటలతో పూర్తిగా ఏకీభవిస్తూ నర్సిరెడ్డిగారిగురించి రెండు విషయాలు మొదట ప్రస్తావించి దాని తరువాత మిగిలిన విషయాలు మాట్లాడదలచాను. 1969వ సంవత్సరంనుండి వారు నాకు పరిచయము. మేము అప్పుడు తెలంగాణా ఉద్యమం చేస్తున్నప్పుడు మాతో వారు కూడా ఉన్నారు. అప్పటినుండి కూడా నర్సన్న, నర్సన్న అని పిలిచేవాడిని. నేను ఎమ్.పి.గా ఉన్నప్పుడు వారు ఇక్కడ కౌన్సిల్‌లో, అసెంబ్లీలో సభ్యులుగా ఉన్నారు. అప్పటినుండే మా మధ్య మంచి సంబంధాలు ఉండేవి. నేను ఇక్కడ ఉన్నప్పటికీ, ఢిల్లీలో ఉన్నప్పటికీ వారు వచ్చినప్పుడు నన్ను కలిసేవారు. ఆవిధంగా మా మధ్య మంచి సంబంధాలే ఉండేవి. సర్పంచ్ లెవెల్‌నుండి వచ్చిన వారు గ్రామసీమల అభివృద్ధిని కాంక్షించేవారు. శాసనసభలోగాని, మరే ఇతర మీటింగ్స్‌లోనైనా తెలంగాణా అభివృద్ధి విషయంగురించి తప్పకుండా ప్రస్తావించే వ్యక్తి. మంచివాడు, అజాతశత్రువు. వారికి శత్రువులు ఉన్నట్లు నాకు కన్పించలేదు. మంచి పార్లమెంటేరియన్ కూడా. ఆయన జనతాపార్టీలోకి వెళ్లాడు కూడా. అపోజిషన్‌లోకి వెళ్లినప్పుడు కూడా నేను చూశాను. కొన్ని ప్రిన్సిపుల్స్ కోసం ఆ పార్టీవారు మంచి చేస్తారని అనుకున్నప్పుడు నిస్సంకోచంగా జనతా పార్టీలో చేరాడు. అప్పటి పాలసీలు కొన్ని వ్యతిరేకించి ఆవిధంగా చేశాడు. అంతటి ధైర్యం ఉన్న వ్యక్తి ఆయన. అటువంటి మంచి వ్యక్తిని నక్సలైట్లు చంపటం నిజంగా సహించరాని విషయం. ఈ సంఘటనను అందరూ ఖండించారు, నేను కూడా ఖండిస్తున్నాను.

నా అభిప్రాయాలు అందరికీ తెలుసు. నేను పి.సి.సి. అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఈ నక్సలైట్లపట్ల సానుభూతి చూపాను. వారిని పిలిచి మాట్లాడమని చంద్రబాబునాయుడుగారిమీద ఒత్తిడి తీసుకువచ్చాను. మేము ఇతర పక్షాలతో కలిసి గాంధీభవన్‌లో మీటింగ్‌పెట్టి వారిపై ఒత్తిడి పెంచాము. మొదట వద్దని అన్నప్పటికీ తరువాత వారు సానుకూలంగా సమావేశాలు ఏర్పాటుచేశారు. అప్పుడే మంచిగా వ్యవహారం జరిగి ఉండి ఉంటే బహుశా ఇంత దూరం వచ్చి ఉండేది కాదు. అయితే కొన్ని కారణాలవలన కాలేదు. ముఖ్యమంత్రిగారు బాధను వ్యక్తంచేశారు. నేను కూడా చూస్తున్నాను. జగిత్యాల మీ (గౌరవ సభాపతి) నియోజకవర్గం ప్రక్కనే ఉన్నది. ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్లు మా జిల్లాలోనే స్టార్ట్ అయ్యారు. పెద్దలు రాజేశ్వరరావుగారు ఉన్నారు. వారు కూడా చూశారు. అప్పుడు శాంతియుతంగా సిద్దాంతాల కోసం పనిచేసేవారు. అయితే కొంతమంది భూస్వాములు పోలీసులు సహకారం తీసుకుని వారిమీద దౌర్జన్యం చేశారు. నేను అప్పుడు పార్లమెంట్ సభ్యునిగా సానుభూతిని వ్యక్తంచేస్తూ అన్యాయం జరగకుండా అన్ని విధాలుగా చూశాను. అప్పటి నుండి ఉద్యమంపట్ల ఆవిధంగా సానుభూతితో ఉన్నాను. కాని నర్సిరెడ్డిగారిని చంపిన తరువాత సానుభూతి అనేదే లేదు. నేను మా పార్టీలోగాని, కేబినెట్‌లోగాని ఎప్పుడు మాట్లాడినా వారి విషయం మాట్లాడుతూ వచ్చాను. వారితో సంప్రదింపులు జరిపారు. పోలీసులకు ఇన్‌స్ట్రక్షన్స్ ఇవ్వమని ముఖ్యమంత్రిగారికి చెప్పాను. అప్పుడు ఆ ముఖ్యమంత్రిగారికి, ఇప్పుడు మా ముఖ్యమంత్రిగారికి ఎన్నోసార్లు చెప్పాను. ఏదిఏమైనప్పటికీ చేసే పనులకు అర్థం ఉండాలి. నర్సిరెడ్డిగారు ఏమి పాపంచేశారు? తెలంగాణా పట్లగాని లేక వారిపట్లగాని వ్యతిరేకంగా ఎప్పుడూ మాట్లాడలే దు. అటువంటి మంచి వ్యక్తిని చంపటంద్వారా వారు సాధించేది ఏమిటో నాకు అర్థంకావటంలేదు. ఉద్యమం స్టార్ట్ చేసినప్పుడు మంచి వ్యక్తులే ఉన్నారు. ఇప్పుడు దారితప్పి పోతున్నారు. ఇప్పుడు అందులో ఉన్న వ్యక్తులకు సిద్ధాంతం లేదు. ఏమీలేకుండాపోతున్నారు, తప్పుతోవలోపోతున్నారు.

బ్యాన్ విధించే విషయంలో మా ముఖ్యమంత్రిగారిని మేమంతా సపోర్ట్ చేశాము. మొదట్లో ఉన్న అభిప్రాయం ఇప్పుడు లేదు. ఈ దుర్మార్గం చూసిన తరువాత మాకు మంచిగా అన్పించలేదు. ఈ మార్గంలో వెళ్లి సాధించేది ఏమీ ఉండదు. తుపాకీగొట్టం ద్వారా సాధించలేరు. నేను పదవ తరగతిలో ఉన్నప్పుడు తెలంగాణా మూవ్‌మెంట్ ఉండేది. కమ్యూనిస్ట్‌లకు తెలుసు. వారు కూడా తుపాకీ పట్టుకునేవారు. రాజేశ్వరరావుగారు కూడా అండర్‌గ్రౌండ్‌లో ఉన్నారు. నేను చిన్నపిల్లవాడుగా ఉన్నప్పుడు చూశాను.

ఉ.10.40

అయితే తరువాత రియలైజ్ అయ్యారు. ఇది లాభం లేదనుకున్నారు. తుపాకుల ద్వారా మనం ఏమీ చేయలేమన్న ఉద్దేశంతో మెయిన్ స్ట్రీమ్‌లోకి వచ్చారు. ప్రజాస్వామ్యంలో పాల్గొంటున్నారు. ప్రతినిధులుగా వస్తున్నారు. వారి యొక్క అభిప్రాయాలు ఇక్కడ వ్యక్తపరుస్తున్నారు. ప్రజా సమస్యల పట్ల కష్టపడి పరిష్కారం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఈ విధంగా చేయాలే తప్ప ఆ విధంగా చేస్తూ పోతే మాత్రం లాభం లేదు. ప్రజా స్వామ్యం మీద విశ్వాసం వున్న వ్యక్తులు ఎవరు కూడా వారి యొక్క చర్యలను మన్నించరు. దానిని ఎవరు కూడా సమర్థించరు. నేను మరొకసారి ఈ హత్యను ఖండిస్తున్నాను. మరొకసారి నేను మీ ద్వారా వారికిఈ అవకాశం తీసుకొని విజ్ఞప్తి చేస్తున్నాను. నర్సిరెడ్డి గారి లాంటి వారిని మీరు చంపుతున్నారు. దీనితో ఏమవుతుందంటే రేపు వాళ్లు ఎవరిని కూడా స్పేర్ చేయరు. మీకు కూడా తెలుసు. అధ్యక్షా, గతంలో మీ స్థానంలో మా జిల్లాకు సంబంధించిన శ్రీ పాద రావు గారు స్పీకర్‌గా వుండే వారు. పాపం ఆయన కూడా వారికి ఎన్నో విధాలుగా సహకరించారు. కాని ఆయనను కూడా వాళ్లు స్పేర్ చేయలేదు. దుర్మార్గంగా చంపారు. మరి ఈ విధమైన పనిచేసుకుంటూ పోతే ఎవరు క్షమిస్తారు? ఇలాంటి పరిస్థితుల్లో ఎక్కడికి పోతుంది దేశం? దీనిని ఇక్కడున్న అన్ని పార్టీలు కూడా ఖండించాలి.

తరువాత ఇంకొక విషయం అధ్యక్షా. ముఖ్యమంత్రి గారు ఒక ప్రపోజల్ పెట్టారు. గతంలోరాగ్యా నాయక్ గారు చనిపోయిన సందర్భంలో ఒక మంచి సాంప్రదాయం పెట్టారు. అప్పుడు ప్రపోజల్ పెట్టినప్పుడు అప్పుడున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు వెంటనే లేచి ఆ రోజు సపోర్ట్ ఇచ్చారు. కాని ఈ రోజు మా ముఖ్యమంత్రి గారు ప్రతిపాదన చేస్తే కండిషనల్‌గా సపోర్ట్ ఇచ్చే పరిస్థితి కనపడుతున్నది. ఆశ్చర్యం! నేనేమనుకుంటున్నానంటే వారు కూడా పాత మిత్రుడే ఆయనకు. ఇద్దరూ కలిసి కొన్ని సంవత్సరాలు పని చేశారు కాబట్టి వెంటనే అంగీకరించి వుండవలసింది. మేము కూడా యాక్సెప్ట్ చేస్తున్నామని,ముఖ్యమంత్రి గారితో ఏకీభవిస్తున్నామని అనకుండా ఇతర పార్టీలు ఏమంటాయో చూసిన తరువాత దాని గురించి మాట్లాడతామంటున్నారు. అది మంచిది కాదు బాబూ! మీ స్టాండ్ అప్పుడొక స్టాండ్, ఇప్పుడొక స్టాండ్ కావడం వల్ల అవస్థలు వస్తున్నాయి. కావున ఇలా కాకుండా సూటిగా మా ముఖ్యమంత్రి గారు పెట్టిన ప్రపోజల్‌ను దయచేసి మీరు యాక్సెప్ట్ చేయండి. తరువాత ఇక్కడున్న లెఫ్టిస్ట్ మిత్రులు చెబుతున్నారు. మీరు కూడా యాక్సెప్ట్ చేసి అక్కడ ఏ పార్టీ కూడా కంటెస్ట్ చేయకుండా వారి కుటుంబసభ్యులు సూచించిన అభ్యర్థిని మీరు కూడా సపోర్ట్ చేసి ఇక్కడకు తీసుకు వస్తే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుంది. నేను మరొకసారి వారి కుటుంబ సభ్యులకు నా సంతాపాన్ని తెలుపుతూ వారికి మంచి జరగాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ టి. దేవేందర్ గౌడ్(మేడ్చల్) : అధ్యక్షా, పెద్దలు నర్సిరెడ్డి గారు ఆగస్టు 15వ తేది దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజున దారుణంగా హత్య చేయబడడం మా అందరినీ చాలా దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయన అజాతశత్రువు, అపార రాజకీయానుభవం ఉన్న వ్యక్తి. ఈ శాసనసభలోకి రాగానే మీ సీటు వైపు చూడగానే వారే కనపడేవారు. ఏదైనా విషయం వచ్చిన సందర్భాలలో అవసరమైతే చాలా గట్టిగా మందలించేవారు. అలాగే ఏదైనా సందర్భం వచ్చినప్పుడు గట్టిగా చెప్పేవారు. సభలో ప్రొసీడింగ్స్ చక్కగా జరగడానికి చాలా ప్రయత్నం చేసేవారు. వారు వయస్సు రీత్యా ఒకొక్కసారి గట్టిగా మాట్లాడినప్పుడు కూడా మేమందరం వారి పట్ల అపారమైన గౌరవంతో వ్యవహరించేవారము. ఆ విధంగా నర్సిరెడ్డి గారు అందరి యొక్క అభిమానాన్ని చూరగొన్న వ్యక్తి. శాసనసభలో కూడా ఏదైనా డిబేట్ జరిగినప్పుడు, ఆ డిబేట్‌లో మంచిగా మాట్లాడినప్పుడు బయటికి వచ్చిన తరువాత చాలా బాగా మాట్లాడావని అప్రీషియేట్ చేసేవారు, సజెషన్స్ ఇచ్చేవారు. ఏదైనా పొరపాటుగా మాట్లాడినప్పుడు ఆ విధంగా నీవు మాట్లాడాల్సింది కాదని చెప్పేవారు. ఆ విధంగా వారెంతో ప్రజాస్వామ్య యుతంగా అందరినీ గౌరవించే మనస్తత్వం ఉన్న వ్యక్తి. అటువంటి చక్కని వ్యక్తిత్వాన్ని కలిగి ఉన్న ఆయనను తీవ్రవాదులు పొట్టను పెట్టుకోవడం మనందరికీ దిగ్భ్రాంతిని కలుగజేసింది.

అధ్యక్షా, ప్రజాస్వామ్యంలో ఈ విధమైన హింసకు తావులేదు. మన యొక్క భావాలను వ్యక్తం చేసుకోవడంలో ఒకరికి ఒకరికి మధ్య భేదాభిప్రాయాలు అనేకం ఉంటాయి. ప్రజాస్వామ్యంలో ప్రజాసమస్యలు పరిష్కరించుకోడానికి రకరకాలైన వ్యక్తులు, రకరకాలైన సంస్థలుతమకు అనుకూలమైన వివిధ రకాలైన పద్ధతులలో వెళ్తుంటారు. కాని అందరూ ఏకాభిప్రాయాలతో వెళ్లే సందర్భాలు ఉండవు. కనుక చాలా సందర్భాలలో బేధాభిప్రాయాలు వస్తూ ఉంటాయి. కాని అలాంటి సందర్భాలలో భౌతికంగా వ్యక్తులను లేకుండా చేయడం అనే పద్ధతి వల్ల కాని, సిద్ధాంతం వల్ల కాని ఎక్కడా సమస్యకు పరిష్కారం జరగదు. అది సమస్యను ఇంకా జటిలం చేస్తుంది. కనుక ప్రజాస్వామ్యవ్యవస్థలో హింసకు తావు అన్నది లేదు. ఎటువైపైనా హింసకు తావు లేని ప్రశాంత వాతావరణంలో ప్రజాస్వామ్య యుతంగా సమస్యను పరిష్కరించుకోడానికి ప్రయత్నం చేయాలే తప్ప భౌతికంగా దాడులు చేస్తూ వ్యక్తులనే లేకుండా చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది అనేది చాలా తప్పు. సమస్యలున్నంత కాలం వ్యక్తులు, నాయకులు అందులోంచే పుట్టుకొస్తూ ఉంటారు. వారు ఏదో రూపంలో సమస్యకు పరిష్కారం చేయడానికి ప్రయత్నం చేస్తూనే ఉంటారు. అందులోనూ ప్రజాస్వామ్యంలో నాయకులకు కొదవ ఉండదు. అది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంటుంది. ఆ ప్రక్రియలో చాలా మంది వ్యక్తులు, నాయకులు తమ తమ పనులను కొనసాగిస్తూ ఉంటారు. ఆయా సందర్భాలలో చాలా అభిప్రాయాలను చెబుతూ ఉంటారు. అలాంటి పరిస్థితులలో అక్కడ వ్యక్తులను మాత్రం పూర్తిగా లేకుండా చేయడం అనే సిద్ధాంతం మంచిది కాదని నా అభిప్రాయము.

అధ్యక్షా, నర్సిరెడ్డి గారు తనకున్న అపార రాజకీయ అనుభవంతో ఈ రాష్ట్రానికి ఎంతో సేవ చేసారు. తన జిల్లాకు తన ప్రాంత వాసులకు సేవ చేసారు. వారిని అందరూ ఎంతో చక్కగా గౌరవించే స్థాయికి ఎదిగారు. ఆ విధమైన వ్యక్తి లేకపోవడం బాధ కలిగిస్తున్నది. వారికి, వారి కుటుంబసభ్యులకు నా ప్రగాడమైన సంతాపాన్ని తెలియజేసుకుంటూ వారి కుటుంబ సభ్యులకు అన్ని విధాలా మేలు చేయాలని ఆ భగవంతుడిని కోరుతున్నాను. పెద్దలు సత్యనారాయణ రావు గారు మాట్లాడుతూ మా నాయకుడు మాట్లాడిన దానికి ఇంకొక రకంగా అర్థం చేసుకున్నట్లు ఉంది. ముఖ్యమంత్రి గారు ప్రపోజల్ పెట్టారు. గతంలో మేము అధికారంలో ఉన్నప్పుడు మా నాయకుడు ఆ రోజులలో ఇమ్మీడియేట్‌గా ఒప్పుకోవడమే కాకుండా అందరి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేసారు. ఈ రోజు కూడా మా ఉద్దేశ్యమల్లా ఇతర రాజకీయ పార్టీలు అన్ని కూడా ఒప్పుకోకుండా అక్కడ ఎలక్షన్ జరిగే పరిస్థితి వస్తే కొన్ని సమస్యలు వస్తాయి. Afterall political systemలో పొలిటికల్ పార్టీలుగా మనం ఉన్నాము. కాబట్టి ఆ విధంగా జరగకుండా వారే చొరవ తీసుకొని అన్ని రాజకీయ పార్టీలతో మాట్లాడితే బాగుంటుందని వారు అభిప్రాయం తెలియజేసారు. మీ ప్రపోజల్‌కు మేము సిద్ధంగా ఉన్నాము. అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలు కూడా మీరు తీసుకొనడం అవసరము. ఆ విధంగా కాకుండా ఇతర రాజకీయ పార్టీల వారు ఎవరైనా నిలబడి ఎలక్షన్స్ జరపడం అనివార్యమైతే ఇబ్బందులు వస్తాయన్నది మా నాయకుడి ఉద్దేశ్యం. ఎందుకంటే ఎంతో మంది పొలిటికల్ వర్కర్స్ ఉంటారు, పొలిటికల్ పార్టీస్ ఉంటాయి, అందరి అభిప్రాయాలు తీసుకోకుంటే ఆ సమయంలో ఇబ్బందికరమైన పరిస్థితులు వస్తాయనే భావం వ్యక్తం చేసారు తప్ప వారు పెద్ద మనిషిగా ఉండి ఇంకొక రకంగా వ్యాఖ్యానించే ప్రయత్నం చేయడం మంచిది కాదనేది నా అభిప్రాయం. అందరం హుందాతనంతో ఉన్నాము, సిస్టం పట్ల గౌరవంతో ఉన్నాము. We are not concerned about the individuals. వ్యవస్థ పట్ల ఆందోళన చెందుతున్నాము తప్ప ముఖ్యమంత్రి గారు చేసిన ప్రపోజల్‌ను యాక్సెప్ట్ చేయడానికి మేము కూడా సిద్ధంగా ఉన్నాము. ప్రజాస్వామ్యం పట్ల అపారమైన గౌరవంతో ప్రజాస్వామ్య వ్యవస్థను ముందుకు నడపాలనే విశ్వాసం ఉన్న పార్టీలుగా మీరు అందరి అభిప్రాయాలను తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాను తప్ప ఇంకొకటి ని తెలియజేసుకుంటూ నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

*శ్రీమతి డి.కె.అరుణ(గద్వాల్): అధ్యక్షా, స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన వ్యక్తిని స్వాతంత్ర్య దినోత్సవం నాడు నారాయణపేట పట్టణంలో ఒక అధికారిక కార్యక్రమంలో పాల్గొంటుండగా ఈ శాసనసభ సభ్యుడైన నా తండ్రి శ్రీ నర్సిరెడ్డి గారిని అదే విధంగా నా తమ్ముడైన శ్రీ వెంకటేశ్వర రెడ్డిని మరియు 9 మంది అమాయకులను మావోయిస్టులు అప్రజాస్వామిక పద్ధతిలో జరిపిన దారుణ మారణకాండను తీవ్రంగా ఖండిస్తున్నాను.
ఉ 10.50

ఈ శాసనసభలో మా తండ్రిగారిని, నన్ను చూసి తండ్రీ కూతుళ్లు ఇద్దరూ కూడా ఎంఎల్ఏ లుగా ఉన్నారని చాలా మంది సంతోషంగా అనేవారు . ప్రతిరోజూ కూడా ఇద్దరు, ముగ్గురు ఆవిధంగా అనేవారు. ఈ అసెంబ్లీలోనే మాతండ్రిగారికి ఈవిధంగా సంతాపం తెలుపవలసి వస్తుందని నేను ఎప్పుడూ కూడా ఊహించలేదు. ఒక రైతు కుటుంబంలో జన్మించి చాలా సామాన్యమైన జీవితం గడిపిన వ్యక్తి మా తండ్రిగారు. 19 ఏళ్ల వయసులోనే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. అదే విధంగా నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో కూడా పాలుపంచుకున్నారు. ఎంతో గొప్ప దేశభక్తునిగా కీర్తి పొందినటువంటి వ్యక్తి మా తండ్రి నర్సిరెడ్డిగారు. 25 ఏళ్ల వయసులో 1954లో ధన్వాడ గ్రామానికి సర్పంచుగా ఎన్నిక కావడం ద్వారా ఆయన తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించడం జరిగింది. చిన్న వయసులోనే తండ్రిని పోగొట్టుకుని స్వయంకృషితో జీవితంలో పైకి వచ్చిన వ్యక్తి ఆయన . ఆయన ఇంట్లో ఇద్దరు ఆడవాళ్లు –మా తండ్రి నాయనమ్మ, మా మేనత్త ఉండేవారు, వారే మా తండ్రి గారిని పోషించారు. స్వయం కృషితో పైకి వచ్చిన మా తండ్రిగారు తాలూకా ల్యాండ్ మార్టగేజ్ బ్యాంకుకు 1956లో సేవలు చేశారు. ఆయన రెండు సార్లు సమితి అధ్యక్షులుగా పని చేశారు, అదే విధంగా తెలంగాణా ఉద్యమంలో కూడా పాల్గొన్నారు. 1970 లో మొట్టమొదటి సారిగా ఎంఎల్సి గా ఎన్నికై, 1981–84 లో కూడా శాసన మండలిలో సభ్యులుగా ఉన్నారు. ఆ తర్వాత రెండుసార్లు శాసనసభలో జనతాదల్ సభ్యులుగా, అపోజిషన్‌లో ఫ్లోర్‌లీడర్‌గా ఉన్నారు. తదనంతరం మళ్లీ రెండుసార్లు ఎంఎల్ఏ గా ఎన్నికయ్యారు. మళ్లీ ఆయన 2004 లో కాంగ్రెస్ పార్టీ తరపున శాసనసభకు ఎన్నికైన కొన్ని రోజులకే నక్సలైట్ల దారుణకాండకు గురి కావడం మాకుటుంబానికి తీరని లోటు .

అధ్యక్షా, మాతండ్రిగారు ఒక సిద్ధాంతపరమైన వ్యక్తి. దానికి ఒక చిన్న ఉదాహరణ చెబుతాను. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు 1996లో నేను మహబూబునగర్ నియోజకవర్గం నుంచి టిడిపి తరపున పార్లమెంటు సభ్యురాలుగా పోటీ చేయడం జరిగింది. అప్పుడు మా నాన్నగారు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉంటే, నేను ఆయన కూతురిగా టిడిపి తరపున అదే నియోజకవర్గం నుంచి పోటీ చేయడం జరిగింది. ఆయన సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న వ్యక్తి కాబట్టి సొంత కూతురు పోటీలో ఉన్నా, తాను కొనసాగుతున్న కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థిని ఎంపిగా గెలిపించుకున్నారు. నేను కేవలం నాలుగు వేల ఓట్ల తేడాతో ఓడిపోవడం జరిగింది. మాతండ్రిగారు ఎంత ప్రిన్సిపుల్డ్ పర్సనో ఈ చిన్న ఉదాహరణ చాలు .

ఈరోజు నక్సలైట్లు ఇటువంటి ఘాతుక చర్యలకు పాల్పడుతూ ఎంతోమందిని కొడుకులు లేని తల్లులుగా, భర్తలు లేని భార్యలుగా, తండ్రులు లేని పిల్లలుగా, అనాథలుగా చేస్తున్నారు. ఈవిధమైన వీరి చర్యలను సభ్య సమాజం తీవ్రంగా ఖండించాలని ఈ సందర్భంగా కోరుతున్నాను. మాజీ శాసనసభ్యులు రాగ్యానాయక్ గారు ఇదేవిధంగా నక్సలైట్ల ఘాతుకానికి గురైనపుడు, ఆయన విషయంలో ఏవిధంగానైతే బై ఎలక్షన్ లో ఏపార్టీ కూడా తమ అభ్యర్థులను పోటీలో పెట్టకూడదని హౌస్‌లో యునానిమస్‌గా తీర్మానం చేశారో – అదే విధంగా మాతండ్రిగారైన నర్సిరెడ్డి గారి విషయంలో కూడా యునానిమస్‌గా హౌస్‌లో తీర్మానం చేస్తే బాగుంటుందని ఈరోజు ముఖ్యమంత్రిగారు ప్రతిపాదించారు. మక్తల్ నియోజకవర్గంలో తెలుగుదేశం మరియు బిజెపి లు ముఖ్యమైన పార్టీలు . ఆ రెండు పార్టీల నాయకులను కోరుతున్నాను. ఇటువంటి ఘాతుక చర్యలు ఖండిస్తూ

* An asterisk before the name indicates confirmation by the Member.

మాతండ్రిగారి పట్ల గౌరవ సూచకంగా బైఎలక్షన్ యునానిమస్‌గా జరిగేలా తీర్మానించాలని కోరుతున్నాను. నక్సలైట్లను కూడా కోరుతున్నాను, ప్రజాస్వామ్య పద్ధతిలో మీరు ముందుకు రండి, అమాయకుల ప్రాణాలు తీయకండి. మన ప్రధానమంత్రిగారు కూడా – మీరు ప్రజాసామ్య పద్ధతుల్లో ముందుకు రండి అని నక్సలైట్లకు చెప్పారు. ప్రజాస్వామ్యంలోకి రండి, ఎన్నికలలో పాల్గొనండి, మీరు చేయదలుచుకున్నది ప్రజాస్వామ్య పద్ధతుల్లో చేయండని నక్సలైట్లను కోరుతున్నాను. శాంతియుత వాతావరణంలో జీవిద్దాం, అభివృద్ధిని సాదిద్దాం అని కోరుతూ వారి ఘాతుక చర్యలను మరొక సారి ఖండిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ డి. శ్రీనివాస్ ః అధ్యక్షా, ఈరోజు సభలో నర్సిరెడ్డిగారు లేకపోవడం ఎంతో బాధాకరంగా ఉంది. ఆయన నాకంటే వయసులో చాలా పెద్దవారు, తండ్రిలాంటి వారు. నా రాజకీయ గురువైన రాజారామ్‌గారితో ఆయన చాలా సన్నిహితంగా ఉండేవారు, వారిద్దరూ కూడా అన్నదమ్ముల్లా ఉండేవారు. ఆయనతో నాకు గత 32, 33 సంవత్సరాల నుంచి చాలా సన్నిహిత సంబంధం ఉంది. వారి కుటుంబ సభ్యులతో కూడా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి . చాలా గొప్ప ప్రిన్సిపుల్స్ ఉన్న వ్యక్తి నర్సిరెడ్డిగారు. నాకు బాగా జ్ఞాపకం ఉంది, 1978లో కాంగ్రెస్ పార్టీ చీలిపోయినపుడు రాజారామ్‌గారు నర్సిరెడ్డిగారిని పిలిచి ఇందిరా కాంగ్రెస్‌లో చేరమని మరీమరీ కోరితే, చేరాలని నాకు ఎంతో కోరిక ఉంది కాని చేరలేనని చెప్పడం జరిగింది. ఎందుకంటే నర్సిరెడ్డిగారు ప్రతిసారీ రాజారామేశ్వరరావు గారిని ఫాలో అవుతుండేవారు. రాజారామేశ్వరరావుగారు జనతాదల్ వైపు మొగ్గుచూపడం వల్ల నర్సిరెడ్డిగారు కూడా ఆ పార్టీలో చేరిపోవడం జరిగింది. ఏనాడైనా పార్టీలకు గాని సిద్ధాంతాలకు గాని కట్టుబడి ఉన్న వ్యక్తులలో నర్సిరెడ్డిగారు ఒకరని మనం ఎంతో గర్వంగా చెప్పుకోవచ్చు . 1993లో విజయభాస్కర్‌రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాజారామేశ్వరరావు గారి వెంటే వారు కూడా కాంగ్రెస్‌లో జాయిన్ అయ్యారు. ఆ తర్వాత రెండు పర్యాయాలు శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. ఆయన జనతాదల్ నాయకులుగా కూడా హౌస్‌లో ఉన్నారు. ఏ పార్టీలో ఉన్నా, ప్రధానంగా ప్యానల్ స్పీకర్‌గా ఉన్నపుడు ఆయన ఎంతో హుందాగా వ్యవహరించి అందరి మన్ననలు పొందారు. ఆయనంటే గౌరవించని వ్యక్తి ఎవరైనా ఉన్నారని నేను అనుకోను. ఆయన అజాత శత్రువు . చిన్నవారైనా, పెద్ద వారైనా ఎంతో స్నేహపూర్వకంగా ఉండేవారు .

ఉ.11.00

అప్పుడప్పుడు నాతో జోక్ చేస్తూ నన్ను ఒక్కసారైనా భోజనానికి పిలువవా? అని అనేవారు. నేను మిమ్ములను భోజనానికి పిలిచినా మీరు ఎక్కువగా తినేవారు కాదు, మీరు చాలా తక్కువ తినే వ్యక్తి కదా అయినా మీరు జీవితాంతం ప్యూర్ వెజిటేరియన్ కదా అని నేను అనేవాడిని. ఆ విధంగా మేము ఎంతో అభిమానంతో ఎంతో ప్రేమతో ఉండేవారము. వారు చివరి దశలో అయినా ఇంకా ఉన్నతస్థాయికి ఎదగాలన్న కోరిక గమనించాను. కాని భగవంతుడు వారికి ఆ అవకాశం రాకుండానే చనిపోయారు. ఒక స్వాతంత్ర్య సమర యోధుడిని స్వాతంత్ర్య దినోత్సవం రోజున మావోయిస్టులు పొట్టన పెట్టుకోవడం చాలా దురదృష్టకరం . వారితో పాటు, వారి కుమారుడిని, ఇంకో తొమ్మిది మంది అమాయకులను కూడా చంపడం జరిగింది. వారు ఏ డైరెక్షన్‌లో పోతున్నారు? ఎక్కడికి పోతున్నారు? ఏమి జరుగుతుందన్నది ఊహించని పరిణామంగా జరుగుతుంది. దీనిని ముక్త కంఠంతో అందరూ ఖండించవలసిన అవసరమున్నది. ఇటువంటి విషయాలలో We should all rise above party lines. చక్కని కన్‌సెన్సెస్‌తో మనందరం కలిసి డీల్ చేస్తే మార్గం ఏర్పడుతుంది. తద్వారా ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. దీనిని ఏ మాత్రం రాజకీయం చేయకుండా విశాలమైన హృదయంతో చేస్తే బాగుంటుంది. వారి ఉప ఎన్నిక ఒక ఇష్యూ కాకుండా ఉండాలి. చంద్రబాబుగారు మాట్లాడుతూ ఎలక్షన్ కాకుండా ఉంటే బాగుంటుందని అన్న దానితో నేను ఏకీభవిస్తున్నాను. అది అవసరం కూడా. రాగ్యానాయక్‌గారి విషయంలో బాగానే జరిగింది. కాని కొన్ని చోట్ల కొంతమంది కాంటెస్ట్ చేయడం వల్ల ఆ పరిస్థితి ఇంకో రకంగా జరిగింది. ఏసీ పొలిటికల్ పార్టీ ఎవరికి ఏమి జరిగినా కనీసం వీటిలో అయినా యునానిమస్‌గా రాకపోతే అది

రాజకీయానికి మంచిది కాదని అన్ని రాజకీయ పార్టీలను కోరుకుంటున్నాను. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జి. కిషన్ రెడ్డి(హిమాయత్‌నగర్): అధ్యక్షా, మొన్న బడ్జెట్ సమావేశాలలో మనతోపాటు పాల్గొని సభా కార్యక్రమాలను మీ ఆదేశంతో ప్యానెల్ స్పీకర్‌గా ఉండి పని చేసిన పెద్దలు మక్తల్ ఎమ్.ఎల్.ఎ. గౌరవనీయులు చిట్టెం నర్సిరెడ్డిగారు నేడు మన మధ్య లేకపోవడం అత్యంత విషాదకరం . ప్రజాస్వామ్య వ్యవస్థలో హింసకు తావు లేదని మనం పదే పదే చెప్పుకుంటున్నాము. అయినప్పటికి ఈ రోజు మన దేశంలో కాని, ప్రపంచంలో కాని తీవ్రవాదం గొడ్డలి పెట్టుగా పరిగణించాలి. ఇది ప్రజాస్వామ్య వాదులను తీవ్రంగా కలిచి వేస్తున్న విషయం . ఆయన ఐదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో అనేకమైన నైతిక విలువల కోసం , ప్రజా సంక్షేమం కోసం వారు పరితపించేవారు. చివరకు ఆ యజ్ఞంలో అసువులు బాసిన వారికి నివాళులు అర్పిస్తున్నాము. సర్పంచ్‌గా, సమితి ప్రెసిడెంట్‌గా, ఎమ్.ఎల్.ఏగా ప్రజాస్వామ్యమే లక్ష్యంగా , జన హితమే లక్ష్యంగా ఆయన రాజకీయ ప్రస్థానం కొనసాగింది. తమరి ఆదేశంతో ఆయన హౌస్ కమిటీ ఛైర్మన్‌గా అర్థ సంవత్సరం పాటు పని చేశారు. ఆ కమిటీలో నేను కూడా మెంబర్‌గా ఉన్నాను. ఆ విధంగా వారితో కలిసి మెలిసి పనిచేసే అవకాశం దొరికింది. వారు ఛైర్మన్‌గా సభ్యులను, అధికారులను అందరిని ఆకట్టుకోవడం జరిగింది. ప్యానెల్ స్పీకర్‌గా పార్లమెంట్ సాంప్రదాయాలను లక్ష్యాలను ఆచరిస్తూ పక్షపాతానికి తావు లేకుండా తన పెద్దరికంతో, నా లాంటి కొత్త సభ్యులను ప్రోత్సహించిన తీరు మరచిపోలేము. డెబ్బై సంవత్సరాల వయస్సులో కూడా సభను ఓపికతో నడిపేవారు. అప్పుడప్పుడు మమ్ములను కోపగించుకున్నా చాలా పాజిటివ్‌గా తీసుకుని వారు కూర్చోమనగానే కూర్చునే వారము. ఆ విధంగా వారు అందరిని ఆకట్టుకోవడం జరిగింది. తాను ప్రజల మనిషినని, ప్రజల కోసం పాటు పడడం తన కర్తవ్యమని, తనకు చావంటే భయం లేదని ఎవరైనా మృత్యువాత పడవలసిందేనని, ఎన్ని మంచి పనులు చేశామనేది ముఖ్యమని నర్సిరెడ్డిగారు తన ఉపన్యాసములో చెప్పారు. ఇది రాజకీయ పార్టీలో ఉన్న కార్యకర్తలు ఎవరైనా ఆయన ఉపన్యాసములో ఉన్న స్ఫూర్తిని తీసుకోవాలి. బడుగు బలహీన వర్గాల కోసం పని చేసి, తన ఆశయ సాధనలో స్వాతంత్ర్య దినోత్సవం రోజున బలి కావడం చాలా విచారకరం . ఇప్పటి వరకు ప్రపంచంలో ఏ సాయుధ పార్టీ కూడా ఈ పంథాలో విజయం సాధించలేదు. ఇది చారిత్రక సత్యం . లెనిన్ నుండి మావో వరకు సాయుధ పోరాటంతో అనేక మంది గుర్తించారు. మన స్వాతంత్ర్య పోరాటంలో గాంధీగారు హింస ద్వారా స్వాతంత్ర్యం రాదని అహింస లక్ష్యంగా తీసుకొని ఆయన స్వాతంత్ర్య పోరాటం చేశారు. నక్సలైట్లు, మావోయిస్టులు, తీవ్రవాదులు ఈ విషయాన్ని ఆలోచన చేయవలసిన అవసరం ఉంది. బూజు పట్టిన తుపాకి గొట్టం ద్వారా అధికారాన్ని సాధిస్తామనే దివాలా కోరు సిద్ధాంతాన్ని వారు విడిచి పెట్టవలసిన అవసరం ఉంది. వారు ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల సమస్యల కోసం ముందుకు రావలసిన అవసరం ఉంది. నర్సిరెడ్డిగారు జనతా పార్టీలో ఉన్నా ఎంతో సన్నిహితంగా మెలిగిన వ్యక్తి. వాజ్‌పేయిగారి ఆరోగ్యం, అద్వానీగారి ఆరోగ్యం ఎలా ఉందని మనస్ఫూర్తిగా అడిగేవారు. ఈ రోజు కౌంటర్లు, ఎన్‌కౌంటర్లు నుండి ఈ రాష్ట్రాన్ని విముక్తి చేయాలి. శాంతి లేనిదే అభివృద్ధి జరగదు. అభివృద్ధి జరగనిదే శాంతి రాదు. కాబట్టి రాష్ట్రంలో శాంతిని తీసుకురావలసిన అవసరం ఉంది. రాజకీయాలలో నైతిక విలువలు పాటించవలసిన అవసరం ఉంది. నర్సిరెడ్డిగారి కుటుంబ సభ్యులకు మా బిజెపి పార్టీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలియ చేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటిస్తూ నివాళులు అర్పిస్తున్నాను.

శ్రీ కె.రోశయ్య: అధ్యక్షా, శ్రీ నర్సిరెడ్డిగారు శాసన మండలిలో కాలు పెట్టిన తొలి రోజు నుండి, ఆగస్టు 15 వరకు వారితో కలిసి పనిచేసే అదృష్టం ఉన్న వారిలో నేను ఒకడిని. ఏడు పదుల వయస్సు దాటిన వారము కొంతమందిమి ఉన్నాము. వారిలో నర్సిరెడ్డిగారు ఒకరు. వారు లేనటువంటి సభ చాలా వెలితిగా కనపడుతుంది. మిత్రులందరూ మాట్లాడారు. ప్యానెల్ స్పీకర్‌గా ఉన్నప్పుడు నిష్కర్షగా తరతమ బేధాలు లేకుండా ముక్కుసూటిగా మమ్ములను కాని మరొకరిని కాని మందలించవలసిన అవసరం ఉందని వారు భావిస్తే మందలించేవారు. తరువాత అందరితో సమానంగా ఉండేవారు. కొన్ని విలువలకు కట్టుబడిన రాజకీయ నేత. అరుణగారు చెప్పినట్లుగా చిన్నతనంలో ఒక సంవత్సర ప్రాయంలో తండ్రి చనిపోతే తల్లి, అక్కగారి పెంపకంలో

పెరిగి , స్వయం కృషితో పైకి వచ్చిన వ్యక్తి. వారు కాంగ్రెసు పార్టీలో ఉన్నా, జనతా పార్టీలో ఉన్నా, జనతాదళ్‌లో ఉన్నా పార్టీల కంటే కూడా ప్రజా సమస్యల మీద స్పష్టమైన అవగాహన కలిగి ప్రజలకు మేలు చేసే సందర్భాలు ఏ రకంగా ఆలోచించాలనే దానికి వారు నిదర్శనంగా కనపడేవారు.

ఉ 11.10

అధ్యక్షా, అలాంటిది ఒక మంచి మనిషిని దారుణంగా పొట్టన పెట్టుకోవడం జరిగింది. మిత్రులందరూ వారికి సానుభూతి తెలియపరచడమే కాదు. వారి కుటుంబానికి సంబంధించినంత వరకూ శ్రీమతి అరుణ గారు గాని, వారి తల్లి గారు, వారి పిల్లలు, కుటుంబ సభ్యులు మరియు స్నేహితులందరూ కూడా ఈ దుఃఖాన్ని దిగమింగి ధైర్యంగా నర్సిరెడ్డి గారి ఆశయాలను నెరవేర్చే శక్తి వారికివ్వాలని ప్రార్థిస్తున్నాను. వారి ఆత్మకు కూడా శాంతి కలగాలని మనసారా కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

డా. యన్. జనార్థన రెడ్డి (నాగర్ కర్నూలు)ః అధ్యక్షా, నర్సిరెడ్డి గారు ఒక మహోన్నతమైనమైనటువంటి వ్యక్తి. మా జిల్లాలో కూడా సీనియర్ రాజకీయ వేత్త. నేను సమితి ప్రెసిడెంట్‌గా వున్నప్పటి నుండి నర్సిరెడ్డి గారిని నేను ఎరుగుదును. ఎప్పుడూ కూడా నిర్మొహమాటంగా మాట్లాడే మనస్తత్వం కలిగిన వ్యక్తి. ఎవరిని అయినా నవ్వుతూ పలకరించేవారు. శాసనసభ్యులుగా మా జిల్లాలో జరిగే జిల్లా పరిషత్ మరియు డిడిఆర్‌సి., సమావేశములలో సమస్యల పట్ల స్పష్టమైన అవగాహన కలిగి అక్కడి అధికారులను గాని, నాయకులను గాని నిలదీసే మనస్తత్వం కలిగిన వ్యక్తి. చెప్పాలంటే నిజానికి ఆయనకు శత్రువులు ఎవరూ లేరు. నర్సి రెడ్డి గారు అజాత శత్రువు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున అటువంటి స్వాతంత్ర్య సమర యోధుడు ఈ విధంగా హత్యకు గురికావడం మమ్మెలందరను కూడా దిగ్భ్రాంతికి గురి చేసింది. ఇది చాలా దురదృష్టకరమైనటువంటి విషయం. వారితో పాటు వారి కుమారుడు వెంకటేశ్వర రెడ్డి, అక్కడ వున్నటువంటి అనామకులు కూడా చంపడం జరిగింది. అంతేగాకుండా మునిసిపల్ కమీషనర్ రామ్మోహన్ రావు గారు. ఆర్‌డిఓ., అటెండర్ సాయన్న, కాంగ్రెస్ కార్యకర్త లోకేశ్వర్ రెడ్డి, మాలప్ప గౌడ్, రవీందర్ గౌడ్‌లను, గన్‌మెన్ రాజిరెడ్డి, డ్రైవర్ శ్రీను ఈ విధంగా అమాయకులను కూడా ఆ రోజున చంపడం చాలా బాధ కలిగించినది. ఈ రోజున మా జిల్లాలో కూడా ఒక సీనియర్ రాజకీయ నాయకుడిని కోల్పోయాము. నర్సిరెడ్డి గారు కోపంగా వుండడం నేను ఎప్పుడూ కూడా చూడలేదు. నర్సిరెడ్డి గారు జీవించి వుండగా జరిగిన ఇరిగేషన్ సమావేశములో జిల్లాకు అన్యాయం జరుగుతుందని, బేసిక్ ప్యారామీటర్స్‌ను మార్చినారని అక్కడ వున్న అధికారులను నిలదీశారు. నేను ఎన్నడూ కూడా వారిని ఇంత ఆగ్రహంగా చూడలేదు. అదే విధంగా మీ సీట్లో కూర్చునప్పుడు ప్యానల్ స్పీకర్‌గా కూడా ప్రతిపక్ష సభ్యులనే కాకుండా అధికార పక్ష సభ్యులను కూడా మందలించిన సంఘటనలను మనమందరమూ కూడా చూశాము. ఈ రోజున వారు లేని లోటు వారి కుటుంబానికే కాదు, మా జిల్లాలో కూడా తీరని లోటు. ఈ రోజున అరుణ గారు చెప్పినట్లు మా పార్టీ మరియు మేమందరమూ కూడా పూర్తిగా సహకరించడానికి సిద్ధముగా వున్నాము. వారి యొక్క మరణం, మృతి పట్ల నా సంతాపాన్ని తెలియజేస్తున్నాను. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులకు నా సంతాపాన్ని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పొన్నాల లక్ష్మయ్య ః అధ్యక్షా, స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఈ వార్తను విని చాలా దిగ్భ్రాంతికి గురయ్యాను. నాకు వ్యక్తిగతంగా 1989వ సంవత్సరము నుండి పరిచయం అయినప్పటికీ గత రెండు, మూడు సంవత్సరముల నుండి వారితో చాలా సన్నిహితంగా చర్చించుకోవడం, విషయాల పైన అవగాహన చేసుకునే అదృష్టం కలిగింది. He was really sincere in his concern, he was also sincere in his demand for the development of his area, which is drought prone area and he was also serious at times about the delays, indifference and negligence. That is what I could find out from him. In any case. ఇది చాలా బాధ కలిగించినది. This incident was one of the very few incidents, which made me felt very bad in my life, may be because I liked him more for his outspokenness and his sincerity. Speaker sir, human life is greatest gift of the God in this Universe.

అధ్యక్షా, జీవించే హక్కును ప్రతి ఒక ఒక్కరికీ కూడా భగవంతుడు ప్రసాదించాడు. ఆ హక్కును హరించడం ఎవరి వల్లా కాకూడదని మనం అర్థం చేసుకోవాలి. ఈ హక్కును హరించడం అనేది అత్యంత నీచమైన పని. సమాజం గాని, ప్రజాస్వామ్య ప్రభుత్వాలు గాని, ప్రపంచములోని ఏ చట్టాలు కూడా ఈ హక్కును హరించడం అనే దానిని ఒప్పుకోవు. మనం రాజరిక పరిపాలన నుండి, నిరంకుశ పరిపాలన నుండి, భూస్వామ్య వ్యవస్థ నుండి, పరదేశీయుల పరిపాలన నుండి బయట పడేందుకు ప్రయత్నం చేశామని మీకు కూడా తెలుసు. భూస్వామ్య వ్యవస్థకు చరమగీతం పాడాము. జమిందారీ వ్యవస్థ నుండి బయట పడ్డాము. పేద వారి కోసం, నిమ్న వర్గాల కోసం, బడుగు వర్గాల కోసం వారి అభివృద్ధి లక్ష్యముగా ఈనాటి ప్రజాస్వామ్య ప్రభుత్వాలు పని చేస్తున్నాయనేది అర్థం చేసుకోవలసిన అవసరం వుంది. పేద ప్రజలకు భూపంపిణీ కార్యక్రమం, భూసంస్కరణలు మొదలైనవి ఇందిరా గాంధీ గారితో మొదలై ఈ ప్రభుత్వం పెద్దయెత్తున చేపడుతున్నది. ఈ కార్యక్రమాలన్నింటినీ కూడా ఒకసారి ప్రజల ముందు వుంచవలసిన అవసరం వుంది. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులు ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకొని చట్టాలను చేసి, ఆ చట్టాల పరిధిలో ప్రజా పరిపాలన అందిస్తున్న వారిని అంతమొందించడం ప్రజా వ్యతిరేక చర్యగా గుర్తించవలసిన అవసరం వుంది. మన సమాజం, మన దేశం, మన సంస్క ృతికి సంబంధించి నేను ఒక విషయం చెబుతాను. మొదటి ప్రపంచ యుద్ధం, రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ప్రపంచ దేశాలు ఏ రకంగా పోరాటం చేశాయనేది మరియు హిరోషిమా, నాగసాకి, పెరల్ హార్బల్ విధ్వంసాల నేపథ్యంలో జరిగిన విషయాలు మనందరికీ కూడా తెలుసు. కాని మనం, మన దేశం, మన ప్రజలు, మన పెద్దలు స్వాతంత్ర్యము కొరకు కేవలం సహనం, శాంతి, అహింస, సహాయ నిరాకరణ అనే నాలుగు ఆయుధాలను మాత్రమే ఎంచుకున్నారు. ఈ నాలుగు ఆయుధాలతో ఆంగ్లేయుల పరిపాలనను అంతమొందించి మన దేశంలో ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నాము. ఈనాటి ప్రజా సమస్యల పరిష్కారానికి, ఇప్పటికీ కూడా ఆ నాలుగు ఆయుధాలనే మనం ఎంచుకుంటే బాగుంటుందని నేను మనవి చేస్తున్నాను. ఆనాటి స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి సమస్యల పరిష్కారానికి మార్గదర్శకంగా వుండాలని కోరుతున్నాను. సమస్యల పరిష్కారానికి జన చైతన్యం సమాధానం కావాలి. సహనం, సంప్రదింపులు చర్చల పరిష్కారానికి మార్గాలు కావాలి. ఆవేశం, ఉద్రేకం, హింస, ప్రతి హింస సమాజాన్ని సంస్కరించలేవని మనవి చేస్తున్నాను. ఈ సందర్భముగా వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు నా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

శ్రీ జి. గురునాథరెడ్డి (కొడంగల్)ః అధ్యక్షా, నర్సిరెడ్డి గారి నియోజక వర్గము నా ప్రక్క నియోజక వర్గము. ఈ సందర్భముగా ఒక్క మాట సభ దృష్టికి తెలియజేయవలసిన అవసరమున్నది. చనిపోయేందుకు పదిహేను రోజుల ముందు నర్సిరెడ్డి గారికి ఒక హెచ్చరిక వచ్చింది. సాంబశివుడు అనే మావోయిస్టు నాయకుడు హెచ్చరించాడు. ఆ హెచ్చరిక ఎందుకు వచ్చింది, దీనికి కారణం ఏమిటని నేను నర్సిరెడ్డి గారిని అడగడం జరిగింది. ఈ వయస్సులో నేను ఏమి తప్పు చేశానని నాకు ఎందుకు ఈ విధంగా హెచ్చరిక ఇచ్చారో తెలియదని వారు సమాధానమిచ్చారు. గన్‌మెన్‌లు కూడా అక్కర లేదని వారు అన్నారు. నా వయస్సు అయిపోయింది, ఈ టర్మ్ కూడా నాది చివరిది అవుతుంది, నేను ఎటువంటి తప్పు చేయలేదు అని నర్సిరెడ్డి గారు నాకు చెప్పడం జరిగింది. ఎన్నికల సమయంలో నేను సుమారు ఇరవై రోజుల పాటు నారాయణపేట నియోజక వర్గములో వుండవలసిన అవసరం వచ్చింది. ఆ సమయంలో నేను అక్కడి ప్రజలతో కూడా సంప్రదించాను. నర్సిరెడ్డి గారు వారి జీవితంలో ఎన్నడూ ఒకరికి నష్టం చేసిన వారు కాదు. వారు ఎన్నడూ చిన్న తప్పు కూడా చేసిన వారు కాదని అక్కడి ప్రజలు సమాధానం ఇవ్వడం జరిగింది. ఈ విధంగా ఎందుకు జరిగింది? దీనికి సంబంధించిన చరిత్ర ఏమిటి, ఎందుకు ఈ చర్య తీసుకున్నారు అంటే నాకు తెలిసినంత వరకూ కూడా మావోయిస్టులు వారి ఉనికిని చాటుకోవడం కొరకు చేశారు. మంచి, చెడ్డ అనే విచక్షణ లేకుండా వారిని చంపడం జరిగింది. సంఘటనా స్థలానికి నేను వెళ్లినప్పుడు అది చాలా చిన్న స్థలమని నేను గమనించాను. అక్కడ ముళ్ల చెట్లు పెరిగాయి. అందుకొరకే వారు ఈ స్థలాన్ని ఎన్నుకున్నారు. పోలీసులు ఎవరూ ఆయన వెంట వెళ్లలేదు. ఇద్దరి గన్‌మెన్‌లలో మొదటగా ఒకరిని చంపారు. తండ్రీ, కొడుకుని కూడా చంపారు. ఆ తరువాత ఫైరింగ్‌లో అనామకులను కూడా చంపడం జరిగింది. అందులో నలుగురు ఉద్యోగస్తులు, అయిదు మంది కాంగ్రెక్ కార్యకర్తలు ఉన్నారు. నలుగురు ఉద్యోగస్తులు

సినియర్‌గా హ్యాండీక్యాప్డ్ అయ్యారు. మా ఆర్.డి.ఒ గారు జీవితాంతం హ్యాండిక్యాప్డ్ గానే ఉండిపోవలసి ఉంటుంది. ఈ విధమైన చర్యను తీవ్రంగా ఖండించవలసిన అవసరం ఉంది. ఎవరైతే అయిదు మంది కాంగ్రెస్ కార్యకర్తలు చనిపోయారో వారు చాలా పేద కుటుంబానికి చెందిన వారు. వారిని ఆదుకోవాలని కోరుతున్నాను. నర్సిరెడ్డి గారు కొన్ని వాగ్దానాలు చేసి, ఫౌండేషన్ కూడా వేసారు. వాటిని పూర్తి చేయిస్తామనే వాగ్దానం నేను కూడా చేసాను. దానికి ప్రభుత్వం పూర్తిగా సహకరించాలి. ఇకపోతే, ఆయనకు ఇద్దరు కొడుకులు. ఒకాయన చనిపోయారు. ఒకరు మాత్రమే ఉన్నారు. కూతురు అరుణమ్మ గారు మాట్లాడినట్లు ఆ ఊళ్లో ఆ ఇంటికి తగిన రక్షణ కల్పించాలి. ఈ మధ్య హెచ్చరికలు చేసారని వినికిడి. కాబట్టి ఆ ఇంటి మీద ఎలాంటి చర్య జరగకుండా జాగ్రత్త తీసుకోవాలని కోరుతున్నాను. ఆ కుటుంబానికి నా సంతాపాన్ని తెలియజేస్తూ ముగిస్తున్నాను.

శ్రీ గుమ్మడి నర్సయ్య(ఇల్లందు): అధ్యక్షా, శ్రీ నర్సిరెడ్డి గారు నాకు 1983 నుండి తెలుసు. నాకంటే ముందు మాట్లాడిన వాళ్లు చెప్పినట్లుగా ఆయన రైతు కుటుంబం నుండి స్వయంశక్తితో రాజకీయాల్లో రాణించినటువంటి వారు. కాంగ్రెస్ పార్టీలో కాకుండా జనతా దళ్, జనతా పార్టీలో కూడా పనిచేసినటువంటి వ్యక్తి. నాకు తెలిసిన నాటి నుండి ఆయన ఎంతో సౌమ్యంగా ఎన్నో విషయాలలో స్పష్టంగా ఉండేవారు. ఆగస్టు 15 నాడు ఆయన మరణ వార్త వినగానే నేను అవాక్కయ్యాను. అసలు ఆయనను చంపడం ఏమిటని దిగ్భ్రాంతి చెందాను. గతంలో శ్రీపాదరావు గారు, రాగ్యానాయక్ గారు ఈ విధంగా మంచి స్వభావం కలిగినటువంటి, మంచి భావం కలిగినటువంటి వ్యక్తులను అంతం చేస్తూ వస్తున్న మావోయిస్టులను మనం చూస్తూ వస్తున్నాం.

అధ్యక్షా, ఆనాడు జరిగిన చర్చలను మనం చూసినప్పుడు, ఆ చర్చల ఫలితం ఏమిటంటే నర్సిరెడ్డి లాంటి వాళ్లకు మరణమేనా అనేటువంటి విషయం బోధ పడుతుంది. మా పార్టీ నాయకులను కూడా ఇన్‌ఫార్మర్ల పేరుతో కార్యకర్తలను, రీజనలిస్టుల పేరుతో నాయకులను అంతం చేసారు. దీనిని మొదటి నుండి సి.పి.యం (ఎల్) డెమోక్రటిక్ పార్టీ ఖండిస్తూ వస్తుంది. ఇది తప్పని చెబుతూ వస్తుంది. నిన్న నర్సిరెడ్డి గారి హత్య విషయంలో మా మేధావులు ఇది తప్పని అన్నారు. ఎవరిని చంపడం తప్పు అంటే నర్సిరెడ్డి గారిని చంపడం తప్పు అన్నారు. కాని అతనితోపాటు చనిపోయిన పది మంది సంగతి ఏమిటి? ఆ విషయం మాత్రం ఎవరూ స్పష్టం చేయలేకపోతున్నారు.

అధ్యక్షా, ఈరోజు నర్సిరెడ్డి గారు లేకపోతే సభ వెలితిగా ఉంటుంది అని అంటున్నామే! అదే విధంగా ఆయన కుటుంబంలో ఆయన లేని లోటు, దు:ఖం, బాధ కనబడుతుంది. ఈ విధంగా ఎంతోమందిని ఈ రకంగా హత్య చేసారనేటువంటి విషయం మన ముందున్నా దీనికంతటికీ కారణం ప్రభుత్వ విధానాలే అనేటువంటి ఒకే ఒక్క మాటతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం వైపు నుండి కూడా దూరదృష్టితో ఆలోచించాలని కోరుతున్నాను. నర్సిరెడ్డి గారి లాగ ఇంకెవరూ ఇటువంటి ఈ అఘాయిత్యాలకు గురి కాకుండా సమగ్రమైన పద్ధతిలో చర్చలు జరపాలని కోరుతున్నాను. ప్రజాస్వామ్యం కోసం ఆలోచించాలని నేను భావిస్తున్నాను. అదే విధంగా పోలీస్ డిపార్ట్‌మెంట్ వైపు నుండి కూడా ఒకసారి ఆలోచించాలి. ప్రభుత్వం ప్రజలను పాలిస్తుందా, పోలీసులు ప్రజలను పాలిస్తున్నారా అని చూసినప్పుడు పోలీసులు పాలిస్తున్నారనేటువంటిది మనకు కనబడుతుంది. ఒకనాడు టైగర్స్ ఈనాడు కోబ్రాస్‌కి సృష్టి అయినటువంటిది ఏమిటంటే పోలీస్ యంత్రాంగం. పోలీస్ యంత్రాంగం నుండి ఆ సృష్టి జరుగుతుంది అనేటువంటి విషయాన్ని మొన్న డి.జి.పి గారు చెప్పారు. అది కరెక్ట్ కాదు. ఒకపక్క హింసను కొనసాగిస్తూనే ఇది ప్రజాస్వామ్యం అంటూ అటువంటి వాటికి అవకాశం కల్పిస్తూ, వాటిని ప్రోత్సహించడం సరైనది కాదని నేను భావిస్తున్నాను. మేము కూడా నక్సలైట్ల పార్టీకి సంబంధించిన వాళ్లము. కాని ఎవరి పేర్లు వాళ్లకు ఉన్నాయి. జనశక్తి, సి.పి.ఐ.(యంఎల్) ఈ విధంగా ఉన్నాయి. ఎవరి పేర్లతో వాళ్లను పిలిస్తే బాగుంటుంది. అంతేకాని నక్సలైట్లని అందరినీ అనడం కరెక్ట్ కాదు. ఇంకొక విషయం ఏమిటంటే, ఈనాడు అసెంబ్లీలో తెలంగాణా పార్టీ ఉంది. ఈ తెలంగాణా పార్టీ ముసుగుతో కొంత మంది మావోయిస్ట్ పార్టీ అణుచరులు ఉంటున్నారు. మా ప్రాంతంలో అయితే వాళ్లకు స్థానం లేని దగ్గర కూడా ఒకటి రెండు స్థానాలనుచూపించి ఇక్కడ మా జెండా ఉండవలసిందే అన్నారు. ఈ విషయం టి.ఆర్.ఎస్ వాళ్లు

గమనిస్తే బాగుంటుంది. నర్సిరెడ్డి గారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఆయన ఆత్మకు శాంతిని చేకూర్చాలని కోరుతున్నాను.

శ్రీ పి. జనార్ధన రెడ్డి(ఖైరతాబాద్): అధ్యక్షా, నర్సిరెడ్డి గారి హత్యను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఆగష్టు 15వ తేదీన ఒక శంఖుస్థాపనకు వెళ్లినప్పుడు, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజున, స్వాతంత్ర్య సమర యోధులైనటువంటి వ్యక్తులను దారుణంగా హత్య చేయడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము.
ఉ.11.30

నర్సిరెడ్డి గారు సర్పంచ్‌గా, సమితి ప్రెసిడెంట్‌గా, కౌన్సిల్ మెంబర్‌గా ఉన్నారు. మూడు సార్లు ఎమ్.ఎల్.ఏగా ఎలక్ట్ అయ్యారు. ప్రజలకు ఎనలేని సేవలు చేసిన వ్యక్తి. వారిని మనం మర్చిపోరాదు. ఒక ఎమ్.ఎల్.గా ఉన్న నర్సిరెడ్డి గారిని చంపడమే కాకుండా వారితోబాటు ఉన్న ఆయన కుమారుడు వెంకటేశ్వర రెడ్డి గారిని, మునిసిపల్ కమిషనర్ గారిని , రాజిరెడ్డి అనే గన్‌మ్యాన్‌ను, డ్రైవరైన శ్రీనివాస్ తనను చంపవద్దు అని తన పైన అధార పడ్డ భార్యా పిల్లలు, తల్లి ఉన్నారని వారిని పోషించుకోవాలని కాళ్లు పట్టుకుని వేడుకున్నా వదలకుండా అతనిని కూడా చంపివేయడం జరిగింది. లక్ష్మా రెడ్డి, మానప్ప, రవీందర్‌గౌడ్ అన్న కాంగ్రెస్ కార్యకర్తలను, ఆర్‌డిఓ అటెండర్‌ని కూడా కాల్చి చంపడం జరిగింది. ఈ దారుణాన్ని తీవ్రంగా ముక్త కంఠంతో మనం అందరమూ ఖండించాలని మనవి చేస్తున్నాను. మన దేశానికి 1947 లో స్వతంత్రం వచ్చినా తెలంగాణాలో నిజామ్ పరిపాలన జరగుతుంటే దానికి వ్యతిరేకంగా పోరాటం జరిపిన స్వతంత్ర సమర యోధుడు నర్సిరెడ్డి గారు. అటువంటి వ్యక్తిని పొట్టన పెట్టుకోవడం చాలా బాధాకరం అయిన విషయం. ఫ్లోర్ లీడర్‌గా ఉన్నప్పుడు జనతా పార్టీ తరఫున వారు అతి చాకచక్యంగా మాట్లాడేవారు. ఎంత ముక్కుసూటిగా మాట్లాడినా, నవ్వించేట్లుగా మాట్లాడే వ్యక్తి. అసెంబ్లీలో ప్యానల్ స్పీకర్‌గా ఉండి ఎవరినీ లెక్క చేయకుండా వారేదైతే సరైనది అనుకుంటారో అది వారికి చెప్పి గట్టిగా మాట్లాడి అవతలి వారిని మందిలించిన వ్యక్తి. ఐ-మ్యాక్స్ హౌస్ కమిటీకి చైర్మన్‌గా ఉన్నారు. ఐ-మ్యాక్స్ ధియేటర్ విజిట్ చేసి దాని రిపోర్టు తయారు చేసి ఆ కమిటీ రిపోర్టు సబ్మిట్ చేయాలనుకుంటున్న తరుణం. ఆ కమిటీలో నేను ఒక సభ్యుడిగా ఉన్నాను. దాని వల్ల ఆయనతో చనువుగా ఉండడం జరిగింది. ఎంతో మహోన్నతమైన వ్యక్తి. భగవంతుడు వారి ఆత్మకు శాంతి కలుగజేయాలని కోరుకుంటూ, వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ నాకు ఈ అవకాశం కలుగజేసినందుకు తమకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ నాయని నర్సింహా రెడ్డి(ముషీరాబాద్):- అధ్యక్షా, ఒక స్వాతంత్ర్య సమరుయోధుడు స్వాతంత్ర్య దినోత్సవం నాడు కిరాతకంగా మావోయిస్టులు హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. నర్సిరెడ్డి గారు 1969 లో ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో పని చేశారు. మేము కూడా వారితో పని చేశాము. తరువాత 1985 లో వారు జనతాదళ్ శాసన సభ్యులుగా ఎన్నికయ్యారు. వారు నేను అసెంబ్లీలో 5 సంవత్సరాలు కలసి ఉన్నాము. వారు ఈ రోజువరకు కూడా తెలంగాణా ప్రత్యేక రాష్ట్రం కొరకు అహర్నిశలు కృషి చేశారు. ఆయన ఒక ప్రజాస్వామ్య వాది. నిర్మొహమాటంగా మాట్లాడే వ్యక్తిని, ఏ తప్పు చేయని వ్యక్తిని మావోయిస్టులు చంపడం అన్యాయం. నేను దీనిని ఖండిస్తున్నాను. కేవలం ప్రభుత్వం మీదప్రతీకారం తీర్చుకోవడానికి జరిగిన హత్య. ప్రభుత్వం పోలీసుల మధ్యన నర్సిరెడ్డి గారు చనిపోయారు. ఆయన కుమారుడు చనిపోయాడు. అమాయకులైన వారు ఎంతోమంది చనిపోయారు. దీనిని అందరమూ ఖండించవలసిన అవసరం ఉంది. నర్సిరెడ్డిగారు ఏ ఆశయాలకైతే కృషి చేస్తూ వచ్చారో వాటిని మనం పూర్తి చేసినప్పుడే వారికి నివాళులు అర్పించినట్లు అవుతుంది. నర్సిరెడ్డి గారు ప్రత్యేక రాష్ట్రం కొరకు అహర్నిశలు కృషి చేసి సోనియా గాంధీ గారికి మెమొరాండం ఇచ్చిన వ్యక్తి. మరణించిన వారి స్థానంలో ఎలక్షన్ వచ్చినప్పుడు ముఖ్యమంత్రి గారు ఏదైతే ప్రతిపాదించారో అది మంచి ప్రతిపాదన. దానిని చంద్రబాబు నాయుడు గారు సపోర్టు చేశారు. మేము కూడా దానిని సమర్థిస్తున్నాము. అటువంటిది జరిగితే బాగుంటుంది. దారుణ హత్యకు గురైన వారి స్థానంలో

యునానిమస్‌గా ఎలక్ట్ చేసుకుంటే బాగుంటుంది. దానిని మేమంతా సమర్థిస్తున్నాము. ప్రభుత్వం మొదలు చొరవ తీసుకుని వారితో చర్చలు జరపడానికి ప్రయత్నం చేసింది. కానీ అర్థాంతరంగా దానిని ఆపేయడం జరిగింది. ఇటువంటి దారుణాలు జరగడానికి తావు లేకుండా ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి మళ్లీ నక్సలైట్లతో చర్చలు జరిపి రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం క్రియేట్ చేయడానికి ప్రభుత్వం కృషి చేయాలని నేను ముఖ్యమంత్రి గారిని కోరుతున్నాను. ఆ విధంగా పరిష్కారం చేసుకుని మళ్లీ ఇటువంటి దారుణ హత్యాకాండలు జరగకుండా ప్రభుత్వం కృషి చేయాలని కోరుతున్నాను. ఈ విషయంలో ఇంటిలిజెన్స్ డిపార్ట్‌మెంట్ యొక్క ఫెయిల్యూర్ ఉంది. ఆయనను చంపుతామని సాంబశివుడు ఒక వార్నింగ్ ఇచ్చినా కూడా పోలీసులు ఇంత నిర్లక్ష్యంగా ఉండడం న్యాయం కాదు. పేపర్లలో కూడా వచ్చింది. ఆగస్టు 15 న ఆయన అధికార కార్యక్రమానికి వెళ్లినప్పుడు స్థానిక పోలీసులు వెంట ఉండి ఉంటే ఆయన రక్షింపబడేవారేమో. ఏదైనా కానీ వారిని ఈ విధంగా చేయడం న్యాయం కాదు. ఇల్లెందు ఎమ్.ఎల్.ఏ గారు ఒక మాట ఇప్పుడు చెప్పడం జరిగింది. తెలంగాణా రాష్ట్రంలో నక్సలెట్లు దిన్నెలు కట్టిస్తున్నారు అన్నారు. దానిని నేను ఖండిస్తున్నాను. అటువంటిది ఏమీ లేదు. వారితో నారాజు చెంది, వారు పెట్టిన ఇబ్బందులకు గురయ్యి, చాలామంది నక్సలైట్లు టి.ఆర్.ఎస్ లో చేరారు. కొంతమంది కాంగ్రెస్‌లో చేరారు. అంతే కానీ దిన్నెలు కట్టిస్తున్నారు అని చెప్పడం భావ్యం కాదు. నర్సయ్య గారు చెప్పింది న్యాయం కాదు. ధర్మం కాదు. దానిని సీరియస్‌గా ఖండిస్తున్నాను. మా దగ్గర అటువంటి కార్యక్రమం లేదు. నర్సిరెడ్డి గారి కుటుంబానికి మా సానుభూతిని తెలియజేస్తూ , వారి మరణం పట్ల సంతాపం తెలియజేస్తు సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ సిహెచ్. రాజేశ్వర రావు(సిరిసిల్ల):- అధ్యక్షా, నర్సిరెడ్డి గారి మరణం పట్ల గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని పూర్తిగా బలపరుస్తున్నాను. చాలా మంది వారి సహచరులు, రాజకీయ పార్టీ నాయకులు వెలిబుచ్చిన అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నాను. నర్సిరెడ్డి గారి మరణం ఆయన స్వాతంత్ర సమరయోధుడిగా తిరిగీ మన దేశ స్వతంత్ర మానవ హక్కుల సంరక్షణకు జరుపుతున్నటువంటి, అంతే కాకుండా దేశాభివృద్ధికి సాగుతున్న మహా ఉద్యమంలో అమరవీరులయ్యారని నేను స్వీకరిస్తున్నాను. ఆయనకు నాకు నాలుగు దశాబ్దాలుగా సాన్నిహిత్యం ఉంది. స్వాతంత్ర్య సమరయోధుడిగా తరువాత వారు వివిధ పార్టీలలో ఉంటూ సంఘసేవకుడిగా నిరంతరం సూత్రబద్ధంగా కృషి చేసిన చైతన్యవంతుడు. ఆయన స్వాతంత్ర సమరయోధుడిగా గుర్తింపు అప్లికేషన్ పైన లేక రిప్రజెంటేషన్ పైన రికమెండేటరీ సంతకం చేసే మహాభాగ్యం నాకు కలిగింది. ఆనాడు ఫ్రీడం ఫైటర్స్ కమిటీని భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో సహచరుడిగా పని చేశాను. శాసన సభ్యుడిగా కూడా కలసి పని చేశాను. ఆయనలో స్పష్టంగా కనపడే సామాజిక స్పృహను, సామాజిక అభివృద్ధిని రాజకీయాలలో ఉపయోగించి సమస్యలను పరిష్కరించాలన్న స్పృహ కలిగిన అనుభవశీలి. ఈ రోజు హింసావాదం కొనసాగుతోంది. ఈ హింసావాదాన్ని గురించి ముఖ్యమంత్రి గారు సెలవిస్తూ సామాజిక , ఆర్థిక సమస్య అన్నారు. అందరమూ చెబుతున్నాము.

ఉ.11.40

ఇది సామాజిక ఆర్థిక సమస్యయే. సామాజిక, ఆర్థిక సమస్యల ద్వారా అనేకానేక సాంఘిక హింసలు, ముఖ్యంగా అనేక నేరాలు సాగుతున్నాయి. ఆవిధంగా స్థూలంగా దాన్ని వర్ణించి, అలాగే వొదిలిపెట్టడం కంటే నిర్దుష్టమైన చర్యలు చేపట్టడం అవసరం . యువత ఉపాధికల్పన లేక, నిరుద్యోగం కారణంగా ఇటువైపు ఆలోచించడం, మొగ్గుచూపడం జరుగుతున్నందున, సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారంలో నిర్దిష్టమైన ప్రణాళికలు వేసి, ఒక నిర్ణీతమైన ప్రణాళిక ప్రకారం , ఒక షెడ్యూల్ ప్రకారం పనిచేస్తే వచ్చే కొన్ని సంవత్సరాల్లో దీన్ని పూర్తిగా తగ్గించి నిర్మూలం చేయగలుగుతామనే దృక్పథంతో రాష్ట్రప్రభుత్వం కార్యక్రమాలు రూపొందించడం తప్ప మరొక మార్గం లేదు. ఇది సహజంగా లా అండ్ ఆర్డర్ సమస్యగా వుంటుంది. దీన్ని కాదనడానికి వీలులేదు. ఇది సామాజిక సమస్య కాబట్టి, సమాజంలోని యువత ఆకర్షించబడుతోంది కాబట్టి, దీని సాంద్రతను తగ్గించడానికి, దీన్ని నిరోధించడానికి అవసరమైన నిర్దుష్టమైన చర్యల పైన దృష్టిని కేంద్రీకరించండి. వారితో చర్చలకు అభ్యంతరం లేదు. చర్చించడం మంచిదే. తీవ్రవాదులు, నక్సలైట్స్ తమ సమస్యను, సాంఘిక, రాజకీయ సమస్య అని చెప్పడం లేదు.

'విమోచనోద్యమం ' , ' లిబరేషన్ వార్ ' అంటున్నారు. వారితో చర్చించే విషయంలో చర్చిస్తే చర్చించండి, లేకపోతే లేదు. ఇది సామాజిక సమస్యగా గ్రహించిన మనం నిర్దుష్టమైన సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు, ముఖ్యంగా తక్షణమే నిరుద్యోగాన్ని తగ్గించే కార్యక్రమాల పైన దృష్టిని కేంద్రీకరించి ప్రయత్నించాలి. అందులో ఎటువంటి రాజకీయాలకు తావు లేకుండా తప్పకుండా ఏకోన్ముఖంగా కృషి చేయవలసిన అవసరం వున్నది. అప్పుడే మన ప్రజాస్వామ్యానికి నిజమైన ఆర్థిక పునాదులు బలపడతాయని నమ్ముతూ అలాంటి మంచి కార్యక్రమాలు ప్రభుత్వం చేపట్టాలని, అందరి సహాయసహకారాలతో త్వరత్వరగా ఫలితాలు సాధించాలని కోరుకుంటున్నాను. ఇలాంటి హింసావాదాన్ని నిరోధించడానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరుతూ, శ్రీ సి. నర్సిరెడ్డి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, ఈ అవకాశం యిచ్చిన తమకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

*డాక్టర్ జి. చిన్నారెడ్డి(వనపర్తి): అధ్యక్షా, పెద్దలు నర్సిరెడ్డి గారి దారుణ హత్యానంతరం, గౌరవ ముఖ్యమంత్రిగారు ఈరోజు ప్రవేశపెట్టినటువంటి సంతాప తీర్మానాన్ని హృదయపూర్వకంగా సమర్థిస్తున్నాను. నాకంటే ముందు మాట్లాడిన పెద్దలందరి మాటలతో ఏకీభవిస్తున్నాను. నర్సిరెడ్డి గారి హత్య ఎంతో దారుణమైనటువంటిది. సభ్యసమాజం సిగ్గుతో తలవంచుకోవలసిన విషయం . 76 సంవత్సరాల వయసుతో, జీవిత చరమాంకంలో వున్న వ్యక్తి ఆయన. 76 సంవత్సరాల ఆయన జీవిత కాలంలో 50 సంవత్సరాలు చురుకైన రాజకీయ జీవితం సాగించారు. 50 సంవత్సరాల క్రితం వారు రాజకీయ జీవితం ప్రారంభించినప్పుడు ఏవయితే విలువలు వున్నాయో ఆవిలువలు రానురాను పడిపోయినప్పటికీ, నర్సిరెడ్డిగారు రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకొని ఆ విలువలకు కట్టుబడి, ప్రజలకు మంచి చేయడానికి ప్రయత్నం చేశారే తప్ప ఎప్పుడూ చెడు ఆలోచన చేయలేదు. అటువంటి వ్యక్తిని దారుణంగా చంపడం అనేది అందరం తీవ్రంగా ఖండించవలసిన విషయమని సవినయంగా మనవి చేస్తున్నాను. ఆగస్ట్ 15 వ తేదీ నాడు వనపర్తిలోని ఆర్‌డివో ఆఫీస్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గొప్ప ఎత్తున మేమంతా జరుపుకొని ఆ తరువాత స్థానికంగా వుండే క్రీడా మైదానంలో చెట్లు నాటే కార్యక్రమాలలో పాల్గొంటూ వుంటే వనపర్తి స్థానిక యస్‌ఐ గారు నర్సిరెడ్డి గారి పైన మావోయిస్టులు కాల్పులు జరిపారని, వారితోబాటు తొమ్మిది మంది గాయపడ్డారనే మాట మాకు చేరవేయడం జరిగింది. మేమంతా దిగ్భ్రాంతి చెందాము. ఎందుకంటే నర్సిరెడ్డిగారు మావోయిస్టులకు టార్గెట్ కాదు. నారాయణపేట్ ప్రాంతం కూడా నక్సలైట్స్ ఉనికి తక్కువగా వుండే ప్రాంతం . అటువంటి ప్రాంతంలో వారిపైన దాడి జరగడం అనేది మేము అనుకోని సంఘటన. నర్సిరెడ్డిగారు, వారి కుమారుడైన వెంకటేశ్వర రెడ్డిగారు, వారితోబాటు మరొక తొమ్మిది మందిని మావోయిస్టులు పొట్టన పెట్టుకోవడం జరిగిందని సవినయంగా మనవి చేస్తున్నాను. పోయిన అసెంబ్లీ సమావేశాల్లో నర్సిరెడ్డిగారు, మేమంతా ఆ మూలన కూర్చునే వారము. చల్లా రామకృష్ణారెడ్డి గారిమాటలకు మేమంతా నవ్వుకునే వారము. చిన్న వారితో, పెద్ద వారితో కూడా చాలా కలుపుగోలుగా వుండే వారు నర్సిరెడ్డిగారు .

మహబూబ్‌నగర్ జిల్లా కరువు జిల్లా. వలసలకు పేరుమోసిన జిల్లా. అటువంటి జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులు వస్తేనే పూర్తి న్యాయం జరుగుతుందని పెద్ద ఎత్తున పోరాటం చేసిన వ్యక్తి నర్సిరెడ్డి గారు . కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలోని నాలుగు నీటి పారుదల ప్రాజెక్టులు మొదలైన సందర్భంలో, ఆ ప్రాజెక్టుల ద్వారా దాదాపు 8 లక్షల ఎకరాలభూమి సాగులోకి రాబోతున్న సందర్భంలో అందరికంటే ఎక్కువగా ఆనందపడిన వ్యక్తి పెద్దలు నర్సిరెడ్డిగారేనని సవినయంగా మనవి చేస్తున్నాను. నర్సిరెడ్డిగారు భీమా ప్రాజెక్టు సాధన తన జీవితాశయం అని అనేకమార్లు చెప్పేవారు. భీమా ప్రాజెక్టుకు అన్ని అనుమతులు వున్నప్పటికి గత ప్రభుత్వం చేపట్టనందున కోర్టులో పిటిషన్ వేసినటువంటి వ్యక్తి నర్సిరెడ్డి గారు. భీమా ప్రాజెక్టు పనులను ఈ ప్రభుత్వం మొదలుపెట్టిన తరువాత తన జీవితాశయం నెరవేరిందని, ఇంతకంటే జీవితంలో తాను కోరుకునేది మరేదీ లేదని తెల్పిన వ్యక్తి ఆయన . తమ ద్వారా గౌరవ ముఖ్యమంత్రిగారిని, ప్రభుత్వాన్ని కోరుతున్నాను. నర్సిరెడ్డిగారి నియోజకవర్గమైన మక్తల్‌కు నీరు అందించే నీటిపారుదల ప్రాజెక్టుకు వారి పేరుతో నామకరణం చేస్తే వారి పేరు చిరస్థాయిగా

* An asterisk before the name indicates confirmation by the Member.

వుంటుంది. సామాన్య రైతు కుటుంబంలో జన్మించి , సామాన్య రైతుగా జీవితం మొదలుపెట్టి సర్పంచ్ స్థాయి నుండి ప్యానల్ స్పీకర్ స్థాయికి ఎదిగిన వ్యక్తి ఆయన. రాజకీయంగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని వారు నిలబెట్టుకున్నారు. వారు ప్యానల్ స్పీకర్‌గా చాలా చక్కగా వ్యవహరించేవారు. చక్కటి సమయపాలనతో, పాలకపక్షమైనా, ప్రతిపక్షాలైనా అందరితో నిష్పక్షపాతంగా, నిష్కర్షకంగా వ్యవహరించేవారని తమ ద్వారా సవినయంగా మనవి చేస్తున్నాను. ఈ సభలో పదేపదే నర్సిరెడ్డి గారిని జ్ఞాపకం చేసుకోవడం కోసం తమరు కొన్నిసార్లు నర్సిరెడ్డిగా మారుతే బాగుంటుందని మనవి చేస్తున్నాను. మీరు ఆరకంగా మారుతే నర్సిరెడ్డిగారు మా అందరికీ జ్ఞాపకం వస్తారని సవినయంగా మనవి చేస్తున్నాను. నర్సిరెడ్డిగారి దారుణ హత్య వల్ల వారి కుటుంబ సభ్యులు ఒక పెద్ద దిక్కును కోల్పోయారు. నాకంటే ముందు మాట్లాడిన పెద్దలు చెప్పినట్లుగా తండ్రి లాంటి నర్సిరెడ్డిగారు లేకపోవడం వల్ల మహబూబ్‌నగర్ జిల్లా ఒక ప్రముఖ రాజకీయ నాయకుడిని, పెద్ద దిక్కును కోల్పోయింది. ఎల్లవేళలా మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధిని కోరే వ్యక్తిని కోల్పోయింది. నర్సిరెడ్డిగారికి భగవంతుడు ఆత్మశాంతిని చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ , వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. నక్సలైట్స్ హింసాకాండకు బలైన వారి కుటుంబ సభ్యులలో ఒకరిని ఎంఎల్‌ఏగా ఏకగ్రీవంగా ఎన్నుకుంటే బాగుంటుంది. గతంలో రాగ్యానాయక్ హత్యాకాండకు గురియైనప్పుడు వారి కుటుంబ సభ్యురాలికి ఎంఎల్‌ఏగా ఎన్నుకోవడం జరిగింది. గత ఎన్నికలలో మక్తల్‌లో బిజెపి పోటీ చేసింది. గౌరవ ముఖ్యమంత్రిగారు, ప్రతిపక్ష నాయకుడు కోరినట్లుగా అన్ని రాజకీయ పార్టీలు సహకరిస్తే మనం ఏకగ్రీవంగా ఆయన కుటుంబ సభ్యులలో ఒకరిని ఎంఎల్‌ఏగా ఎన్నుకోవడానికి అవకాశం వుంటుందని సవినయంగా మనవిచేస్తూ , వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ అవకాశం యిచ్చిన తమకు ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

ఉ.11.50

SRI G. VINOD: Mr. Speaker Sir, it is with deep regret, anguish and agony that we have lost a senior Legislator, reverend Panel Speaker, Late Sri Chittem Narsi Reddy from whom I used to take his blessings treating him as uncle in this august House. His brutal death on the Independence Day of August 15, 2005, is highly regrettable and absolutely untenable in terms of human approach. A man with seniority of 76 years old getting assassinated for no crime of reason, a person who was dedicated to this august House, having functioned as Panel Speaker during the recently concluded Budget Session and giving his advises to all the younger Legislators and myself as in-charge Minister for Mahabubnagar District, used to take his advises when he used to attend all the possible official and non-official functions in the district, is highly regrettable. We certainly miss his contributions to this august House and to his district particularly when he and his son and along with nine others were so unfortunately assassinated. We on behalf of this august House, express our deep condolences to every member of the families of Late Sri Chittem Narsi Reddy, his son and all the nine members who were assassinated on the eve of Independence Day. I thank the Hon'ble Speaker for giving me this opportunity to say a few words.

శ్రీమతి ఎస్. స్వర్ణ సుధాకర్(అమరచింత) : అధ్యక్షా, కీర్తిశేషులు శ్రీ చిట్టెం నర్సిరెడ్డిగారి గురించి ఈనాడు ఇలా మాట్లాడవలసిన పరిస్థితి రావడం ఎంతో బాధాకరమైన విషయము. చిన్న వయస్సు నుండే సోషలిస్టు భావాలను కల్గిన ఆయన సర్పంచ్‌గా రాజకీయాల్లో అడుగుపెట్టి అంచలంచెలుగా ఎదిగి, ఎన్నో పదవులను చేపట్టి, చివరకు ప్రజల మధ్యనే హత్య కావింపబడటం సభ్య సమాజంలోని ప్రతి ఒక్కరు ఖండించవలసిన విషయము.

అధ్యక్షా, ఆయన ఏ పార్టీలో ఉన్నా ఆ పార్టీకి వన్నె తెస్తూ, అందరితో ఆత్మీయతతో స్నేహితుడుగా మెలుగుతూ అందరి ప్రేమాభిమానాలను చూరగొన్న గొప్ప వ్యక్తి నర్సిరెడ్డిగారు. ఆయన తన రాజకీయ జీవితంలో ఏలాంటి ప్రలోభాలకు, ఏలాంటి ఒత్తిడులకు, ఏలాంటి అవినీతికి లొంగకుండా, అధికారంలో ఉన్నా, లేకపోయినా ముక్కుసూటిగా వ్యవహరిస్తూ, నాయకుడంటే ఇలా ఉండాలి సుమా అని అందరిచే ప్రశంసింపబడిన గొప్ప వ్యక్తి, నేత కూడా. ప్యానల్ స్పీకర్‌గా ఇటు అధికార పక్షానికి, అటు

ప్రతిపక్షానికి కూడా నచ్చిన వ్యక్తిగా ఉంటూ, అవసరమైన సమయంలో కఠినంగా వ్యవహరిస్తూ, ప్రజా సమస్యలను ప్రస్తావించడానికి అందరికీ అవకాశం కల్పిస్తూ సభను ఎంతో హుందాగా నడిపిన సమర్థుడు.

అధ్యక్షా, ఆయన ఎప్పుడూ ఒక మాట చెపుతుండేవారు. అమ్మా ! మన పదవులు శాశ్వతం కాదు, మనం కూడా శాశ్వతం కాదు, కేవలం మనం చేసిన మంచి పనులే మన వెంట, మన తరువాత కుడా ఉంటాయి, దానిని ఎప్పుడూ గుర్తు పెట్టుకో అంటూ నాకు సూచనలు ఇస్తూ, నాకెంతో ధైర్యాన్ని ఇస్తూ, ఎవరికీ భయపడ వద్దు అంటూ వారు సలహాలు ఇస్తూ, తండ్రి తరువాత తండ్రి అంతటి వాడిగా నాకు ఆదర్శంగా నిలిచారు. ఈరోజున వారు ఇక్కడ లేకపోవడం నాకు తీరని లోటుగా అనిపిస్తున్నది.

అంతేకాదు, ఎప్పుడయితే నీటిపారుదల ప్రాజెక్టులకు అనుమతులు వచ్చాయో, అప్పుడు ఆయన ఎంతో సంతోషంగా మాట్లాడుతూ, అనుమతులు రావడమే కాదు, ఈ ప్రాజెక్టులు అన్నీ కూడా పూర్తయి మన కళ్ల ముందు ఆ నీళ్లు పారుతున్న రోజు రావాలి, అంతవరకు నాకు నిద్ర ఉండదు, నాకు మనశ్శాంతి ఉండదు అని ఎప్పుడూ అనేవారు.

నర్సిరెడ్డిగారితోపాటు, వారి కుమారుడు వెంకటేశ్వర రెడ్డిగారు, ఇంకా మరో తొమ్మిది మంది అమాయకులు ఈరోజున మన మధ్య లేరు. వారి ఆత్మలకు భగవంతుడు శాంతి కల్గించాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె.రాములు (మెట్‌పల్లి): అధ్యక్షా, గౌ.ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని నేను సంపూర్ణంగా సమర్థిస్తున్నాను. గౌ.ముఖ్యమంత్రిగారు మాట్లాడుతూ, గతంలో రాగ్యా నాయక్‌గారు హత్య కావించినపుడు ఏ విధంగా అయితే ఇతర పార్టీలేవి ఉప ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టలేదో, అదే విధంగా ఇప్పుడు నర్సిరెడ్డిగారి కుటుంబం నుండి ఎవరు నిలబడినా వారికి అన్ని పార్టీలు మద్ధతు ఇవ్వాలన్నారు. దానిని చంద్రబాబునాయుడుతోపాటు, అన్ని ప్రధాన పార్టీలు సమర్థించాయి. ఇప్పుడే మహబూబ్‌నగర్ జిల్లా శాసనసభ్యులు గురున్నాథ రెడ్డిగారు ఒక విషయం చెప్పారు జిల్లాలో lapses ఏవో జరిగాయని, అందువల్లే ఇటువంటి సంఘటన జరిగిందని. కాబట్టి తమరు ఈ విషయమై probe చేయవలసిందిగా కోరుతున్నాను.

అధ్యక్షా, నర్సిరెడ్డిగారి విషయానికి వస్తే, ఆయన సమితి ప్రెసిడెంటుగా ఉన్నప్పుడు ఆయన పనితీరును మెచ్చుకుంటూ జవహర్‌లాల్ నెహ్రూగారు స్వదస్తూరితో ఆయన్ని appreciate చేస్తూ ఉత్తరం వ్రాశారని వారి కుమార్తె అరుణగారు ఇప్పుడే సభలో చెప్పారు. మేమంతా సభకు మొట్టమొదటిసారిగా ఎన్నికైన జూనియర్ శాసనసభ్యులము. వారు ప్యానల్ స్పీకర్‌గా వ్యవహరించారు. సభలో ఏ విధంగా వ్యవహరించాలో వారు మాకు అనేకసార్లు advise చేసేవారు. వారితో సత్సంబంధాలు లేని సభ్యులు ఎవరూ బహుశా ఈ సభలో ఉండరనుకుంటా ! ఇటువంటి సమయంలో we should rise to the occasion, వారి ఆత్మకు భగవంతుడు శాంతి చేకూర్చాలని ప్రార్థించుదాము.

బాలయోగిగారు చనిపోయినప్పుడు లోక్‌సభ ఏ విధంగా అయితే స్పందించి, facilities కల్పించిందో, వాటి గురించి ఒకసారి విచారించవలసిందిగా మిమ్మల్ని కోరుతున్నాను. ఇటువంటి సంఘటనలు జరిగినపుడు రాజకీయాలకతీతంగా రాష్ట్రానికి ఒక మంచి మెసేజ్ పంపవలసిన అవసరం ఉంది. సబితా ఇంద్రారెడ్డి భర్త శ్రీ ఇంద్రారెడ్డిగారు కాని, ఉమా మాధవరెడ్డిగారి భర్త మాధవరెడ్డిగారు కాని చనిపోయినపుడు, నేను ఈ సభలో లేను కాని, ఈ సభ స్పందించవలసిన తీరులో స్పందించలేదని తెలిసింది. వారి సేవలను కూడా ఎప్పటికీ గుర్తు పెట్టుకునే విధంగా మనం ప్రయత్నం చేయాలని మీ ద్వారా ఈ హౌజ్‌కు అప్పీలు చేస్తున్నాను. ఇటువంటి సంఘటనలు జరిగినపుడు ఈ హౌజ్ మొత్తం ఖండించడమే కాకుండా ఒక సాంప్రదాయాన్ని నిలబెట్ట వలసిన అవసరం ఉంది.

శ్రీ నర్సిరెడ్డిగారిని ప్యానల్ స్పీకర్‌గా ఎంపిక చేయడం పట్ల అందరూ మిమ్మల్ని అభినందిస్తున్నారు. అంతేకాకుండా అంతకు ముందు జనతా పార్టీ ఫ్లోర్ లీడర్‌గా కూడా శ్రీ నర్సిరెడ్డిగారు వ్యవహరించి, ఈ రాష్ట్రానికి ఒక దిశ, దశ చూపించారు.

ఈ సందర్భంగా నేను మీ ద్వారా కోరేదేమిటంటే, you are our custodian. రాజశేఖర్‌రెడ్డిగారి నాయకత్వంలో ఈ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తరువాత , జానారెడ్డిగారు ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుని, మావోయిస్టులను చర్చలకు పిలిచారు. ఆ చర్చలను పునరుద్ధరించమని కోరుతున్నాను.

చనిపోయిన శ్రీ నర్సిరెడ్డిగారి కుటుంబ సభ్యులకు శాంతి కలగాలని కోరుతూ, ముగించే ముందు ఒక విషయం చెప్పదలచుకున్నాను. అది రిలవెంటో, కాదో తెలియదు. మొన్నటి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పోలీసులు మన శాసనసభ్యులు శ్రీ తోట గోపాలకృష్ణను కొట్టడంతో, ఆయన రిజైన్ చేసి పారేశాడు. నేను మీ ద్వారా కోరుతున్నాను, ఆ రాజీనామా పత్రాన్ని మీరు ఆమోదించవద్దు. ఆ సంఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ, మరొక్కసారి హత్య కావించబడిన శ్రీ నర్సిరెడ్డిగారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను. నమస్కారము.
మ.12.00

శ్రీమతి గల్లా అరుణ కుమారి(చంద్రగిరి): అధ్యక్షా, సీనియర్ శాసన సభ్యులు శ్రీ చిట్టెం నర్సిరెడ్డి గారు స్వాతంత్ర్య దినోత్సవం నాడు స్వాతంత్ర్య సమరయోధుడిగా, సౌమ్యులుగా ఉన్నవారు హత్యకు గురి అయ్యేరని తెలిసి చాలా షాక్ తిన్నాను అధ్యక్షా. అదే సమయంలో నాకు సోదరితో సమానమైన స్నేహితురాలు డి.కె. అరుణ ను తలచుకుని నేను ఎంతో బాధపడటం జరిగింది. 1989లో నేను కొత్తగా శాసన సభ్యురాలిని అయినాక మా నాన్న గారు నన్ను తీసుకురావడం జరిగింది. మా నాన్న గారు నాకు కొంతమందిని పరిచయం చేశారు. వారిలో నర్సిరెడ్డి గారు ఒకరు. మా నాన్న గారు నన్ను పరిచయం చేసినపుడు అమెరికా నుంచి వచ్చిన అమ్మాయిని రాజకీయాలలోకి తెచ్చావని నవ్వుతూ అన్నారు. ఆ రోజు నుంచి వారు జనతా పార్టీలో ఉన్నారు. సబ్జెక్టు ఏదైనా వస్తే చక్కగా మాట్లాడేవారు. ప్యానల్ స్పీకరుగా ఉన్నారు. అప్పుడప్పుడు నన్ను పిలిచి, మంచి సబ్జెక్టు తీసుకుని మాట్లాడమని నన్ను ఎంకరేజ్ చేసేవారు. నేను మహిళా కాంగ్రెసు ప్రెసిడెంటుని అయినపుడు చిన్నారెడ్డి గారిని అడిగేను, మీ జిల్లాలో ఎవరైనా ఉత్సాహవంతులు, ఎడ్యుకేషను ఉన్న అమ్మాయిలు ఉంటే చెప్పండి, మహిళా కాంగ్రెసులో చేర్చుకుందామని అంటే చిన్నారెడ్డి గారు డి.కె. అరుణ గారిని మొదటి సారి పరిచయం చేశారు. నర్సిరెడ్డి గారి అమ్మాయి అని తెలియగానే వెంటనే నేను ఆమెను జనరల్ సెక్రటరీగా అపాయింట్ చేయడం జరిగింది.

నర్సిరెడ్డి గారు ఈ సారి కాంగ్రెసులో ఉండటంతో అరుణ గారు ఎప్పుడూ ఏదో సబ్జెక్టు గురించి నర్సిరెడ్డి గారి కోసం వచ్చి, వెడుతూ ఉన్నపుడు ' ఏమ్మా పుట్టింటి కొచ్చి వెడుతున్నావా?' అని మేము సందాగా నవ్వుతూ అనేవాళ్లం. చక్కగా మాట్లాడాలని, మంచి సబ్జెక్టు తీసుకుని మాట్లాడాలని, నువ్వు నా బిడ్డ లాంటి దానివని నన్ను ఎంకరేజ్ చేసేవారు. వారు హత్య గావించబడటాన్ని నిజంగా ఖండిస్తున్నాను. అటువంటి సంఘటన జరిగి ఉండకూడదు. వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి, సోదరి అరుణకి మా కాణిపాకం విఘ్నేశ్వర స్వామి ఆశీస్సులు ఉండాలని, నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, ముఖ్యమంత్రి గారు చెప్పినట్లు వారికి ధైర్యాన్నిచ్చి ముందుకు నడిపించాలని కోరుకుంటూ, తప్పనిసరిగా వారు చెప్పినట్లు యునానిమస్‌గా వారి కుటుంబంలో వారికి శాసనసభ్యత్వం ఇవ్వాలని కోరుకుంటున్నాను.

శ్రీ మందాడి సత్యనారాయణ రెడ్డి (హన్మకొండ) : అధ్యక్షా, నర్సిరెడ్డి గారి హత్యోదంతం యావదాంధ్ర దేశాన్ని దుఃఖంలో ముంచివేసింది. నర్సిరెడ్డి గారు నాకు 1978 లో జయప్రకాష్ నారాయణ్ గారి ఆధ్వర్యంలో జనతాపార్టీలో ఉండగా

మొట్టమొదటిసారి పరిచయం అయ్యారు. తర్వాత అనేక సందర్భాలలో కలిశాము. ముఖ్యంగా ఆల్ పార్టీ రైతు ఉద్యమంలో చంద్రబాబు నాయుడు గారు, రాజేశ్వర రావు గారు, కొరటాల సత్యనారాయణ గారు, బిజెపి తరపున నేను రాష్ట్రం అంతటా పర్యటించినపుడు నర్సిరెడ్డి గారు మా వెంట ఉన్నారు. అప్పటి ప్రధాన మంత్రి వి.పి. సింగు గారిని కలిసి మన ప్రాంతంలో రైతాంగం రుణాల మాఫీ కోసం కోరినపుడు వారు మా వెంట ఉన్నారు. అప్పటి నుంచి వారిని నేనెరుగుదును. నేను ఒక్కటి చెప్పదలచుకున్నాను. నేను గంట సేపు చెప్పేదానిని నర్సిరెడ్డి గారైతే ఒక్క వాక్యంలో చెప్పగలిగిన మేధావి. దేనినైనా సూటిగా చెప్పే గొప్పదనం వారిలో ఉండేది. ప్యానల్ స్పీకర్ గా వారిని చూశాము. నర్సిరెడ్డి గారు దారుణంగా హత్య కావడం, వారి వెంట మరో పది మంది చనిపోవడం చూసేక, కళింగ యుద్ధంలో రక్తపాతం చూసి అశోకుడికి జ్ఞానోదయం, ఆత్మావలోకనం కలిగి హింసామార్గం వదలిపెట్టినట్లు, ఈ మావోయిస్టులు, రక్తం చిందించే హింసావాదుల ఎవరైనా కూడా హింసావాదాన్ని వదలి, ఆత్మపరిశీలన చేసుకుని ఈ సమాజం మనది, ఈ ప్రజలు మనవారు, ఈ వ్యవస్థ మనది, పోలీసులు మనవారు, ఇక్కడుండేది మనమే అనుకుని, మనలో మనం ప్రజాస్వామ్యబద్ధంగా సమస్యలు పరిష్కరించుకుందామని వాళ్లకు కూడా కలగాలని కోరుతున్నాను.

ఇంకొక విషయం. జైళ్లకు వెళ్లి జైళ్లలో ఉండేవాళ్లను కలవడం నేరం అనే వారుంటే, జంగల్‌లో ఉండే వాళ్లని హైదరాబాదులో చర్చించడం నేరమని చెప్పేవాళ్లు ఉంటారు. హింస మేము చేయడంలేదు నక్సలైట్లు చేస్తున్నారని ప్రభుత్వం అంటోంది. ప్రభుత్వం చేసే హింసకు ఇది ప్రతి హింస అని వాళ్లంటున్నారు. ఇది విత్తు మొదలా, చెట్టు మొదలా అనే వేదాంత చర్చ. హింస ఎవరు చేసినా, ప్రతి హింస ఎవరు చేసినా సమాజం నలిగి పోతున్నది. మనం నలిగిపోతున్నాము. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, ముఖ్యమంత్రి గారు, హోం మినిస్టరు గార్లకు నా విజ్ఞప్తి ఏమిటంటే, ఈ సమస్య పరిష్కారం చర్చల వల్లనే జరుగుతుంది. మిగతా మిత్రులు చెప్పినట్లు ఇది శాంతిభద్రతల సమస్య కావచ్చు. కాని ఇంతకంటే ఎక్కువ ఆర్థిక, సామాజిక కోణం ఉంది. ఆ సమస్యలను త్వరగా పరిష్కరించగలిగితే ఈ నక్సలైట్ల సమస్య పరిష్కరించుకోగలుగుతాము. గోకుడు పుడితేనే గోకబుద్ధి అవుతుంది. దానికి సరైన మార్గం గోకుడు కాదు. దానికి సరైన మందు పెట్టాలి. నక్సలైట్ల సమస్యకు అణచివేత పరిష్కారం కాదు. ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. ఏదైనా హింస జరిగితే ప్రభుత్వం స్పందించాలి. దానిని అరికట్టాలి. అరికట్టవద్దని ఎవరూ అనడం లేదు. మందు వెయ్యాలి. కాని, At the same time, రోగానికి అది మందు కాదు, రోగ కారణాలకు మందు వెయ్యాలి గాని, రోగ లక్షణాలకు మందు వెయ్యకూడదు. చర్చలు కావాలని ఈ సభ, సమాజం కోరుకుంటోంది.

అధ్యక్షా, బరువెక్కిన గుండెలతో, గంభీరమైన_ వాతావరణంలో నర్సిరెడ్డి గారికి సంతాపం తెలియజేస్తున్న ఈ సభలో ఈ సమయంలో గుమ్మడి నర్సయ్యగారు లేవనెత్తిన దానికి ధీటైన సమాధానం చెప్పగలను కానీ, సందర్భం కాదు. ఆ అంశానికి తప్పనిసరిగా రేపు అవకాశం ఇస్తే, వారికి జవాబు చెప్పగలుగుతాను. సభ యావత్తూ వింటుంది. దీనిని రచ్చ చేయడం నాకు ఇష్టం లేదు. దివంగత నర్సిరెడ్డి గారికి, వారితో మరణించిన వారి కుటుంబాలకు నా సానుభూతిని తెలియజేస్తూ వారి ఆత్మలకు శాంతి కలగాలని కోరుకుంటూ విరమిస్తున్నాను.

శ్రీ కె. జానారెడ్డి : అధ్యక్షా, స్వాతంత్ర్య దినోత్సవం నాడు జరిగిన దారుణమైన, అమానుషమైన హత్య నర్సిరెడ్డి గారి ఉదంతం. వారితోబాటు వారి కుమారుడు, ఇతర 9 మంది వ్యక్తులు దారుణంగా హత్య కావింపబడటాన్ని అనేక పక్షాల నుంచి సభ్యులు, సభ్య సమాజము ఖండించినందుకు నేను నా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాను. ఇప్పటి వరకూ అనేకమంది నాయకులు వారి గుణగణాల గురించి, వారు చేసిన సేవ గురించి వివరించారు. నేను తిరిగి వాటిని అన్నింటినీ చెప్పనవసరం లేదు. ముఖ్యంగా ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను, నాకు అత్యంత ఆత్మీయుడు, చాలా ప్రేమ పూర్వకమైన మనిషి నర్సిరెడ్డి గారు. దానితో బాటు ఇద్దరం కూడా కొన్నిసార్లు కలిసి పనిచేసే అవకాశాలు రావడంతో బాటు, రాజకీయాలు చర్చించినపుడు, మాట్లాడినపుడు వారి

రాజకీయ చతురతతో బాటు రాజకీయంగా వారికి ఉన్న అనుభవాన్ని మేము అర్థం చేసుకోవడంతో బాటు స్ఫూర్తిని పొందాము. రాజకీయ విలువలు కలిగి, రాజకీయంతో బాటు క్రమశిక్షణ కలిగి, మానవత్వం కలిగిన మనిషి. వివిధ పార్టీలలో ఉన్నా మానవతా దృక్పథంతో ప్రజాహితం కోరుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి క్షణం పని చేసిన వ్యక్తిగా ఆయనకు పేరుంది. శాసన సభలో నేను మంత్రిగా ఉన్న సమయంలో కూడా వారు ప్రతిపక్షం నుంచి ప్రజాహితమైన అనేక ప్రశ్నలు వేయడంతో బాటు, సమస్యలను లేవనెత్తి ఆ సమస్యల పరిష్కారం కొరకు ముఖ్యంగా తెలంగాణా ప్రాంతం వెనుకబడిన తనాన్ని ఎత్తి చూపుతూ, తెలంగాణా ప్రాంతం అభివృద్ధి కొరకు సాగునీటి విషయం గురించి అనేక సందర్భాలలో చర్చించి, ప్రజలలో ఆలోచన కలిగించినటువంటి నాయకుడు.

మ . 12 . 10

ప్రజాభిమానం కలిగి, వివిధ రంగాలలో సేవచేసే, అందరి అభిమానం పొందిన ఒక రాజకీయనాయకుడు . ఆయనను ఇటువంటి ఘాతుకమైన చర్యకు పూనుకోవడంతో, అన్నిపార్టీల నాయకులు దీనిని ఖండించడంతో పాటు ప్రజా బాహుళ్యం యావత్తు పెల్లుబికి, తీవ్రవాదాన్ని, హింసావాదానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తూ, అడుగడుగుకూ హెచ్చరిస్తున్నారు . ఈ పెల్లుబుకుతున్న నిరసనను అర్థం చేసుకున్న మావోయిస్టులు వారి పంథాను మార్చుకోవాలి . ప్రజాహితానికి, ప్రజల కొరకు పనిచేస్తున్న వారిని ఈ విధంగా హింసకు, హత్యకు గురిచేసి తమ ఉనికిని చాటిచెప్పుకున్నంత మాత్రాన ప్రజలు వారి పక్షాన ఉండరని ఈ సంఘటన, రాగ్యానాయక్, హత్య సంఘటనల ద్వారా గుర్తు చేసిన విషయాన్ని వారు గమనించాలి . మావోయిస్టులు తమ మనుగడకు ఇటువంటి పంథాను అనుసరించి, ప్రజాహితాన్ని మర్చిపోవడం సహించరాని విషయం . ఈ పరిస్థితిని గమనించి వారి పంథాను మార్చుకోవాలని వారికి తెలియజేస్తూ, ఈ సందర్భంగా తీవ్రవాదాన్ని హింసను అరికట్టి, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి మా ప్రభుత్వం చేస్తున్న కృషిలో ఇటువంటి గడ్డు పరిస్థితులు ఎదురైనపుడు, అన్ని పార్టీలు సహకరించినందుకు వారికి నా ధన్యవాదాలు . దీనివలన ప్రజాస్వామ్య స్ఫూర్తి కలగడంతో పాటు, తీవ్రవాదం, హింసావాదాలను అరికట్టాలనే వారి తీవ్రమైన ఆలోచన ఇది తెలియజేస్తున్నది . అందుకు చాలా సంతోషం . దీనితోపాటు రాబోయే రోజులలో ఈ తీవ్రవాదాన్ని అరికట్టి, హింసను సమాజం నుండి తొలగించడానికి చేసే కృషికి, అన్నిపార్టీలు సమైక్యతను తెలియజేయడంతో పాటు, పూర్తిగా దీనిని తుడిచిపెట్టడంతో పాటు, ప్రజాస్వామ్య పరిరక్షణకు తోడ్పడాలని ఈ సందర్భంగా కోరుకుంటున్నాను . దీనిని అధిగమించడమే కాదు . ఆ కుటుంబాలకు తగిన సానుభూతి తెలియజేసే విధంగా ఏకీభావం వ్యక్తపరచాలని ముఖ్యమంత్రిగారు కోరినపుడు తెలుగుదేశం పార్టీ సంఘీభావం వ్యక్తపరచినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను . ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికే కాదు . హింసను అరికట్టడంలో, దానితోపాటు ఇటువంటి పరిస్థితులను ఎదుర్కొనే దాంట్లో గానీ ప్రజల మద్దతు ఉంటుంది అని తెలియజేయడానికి ఇది సంకేతం . అందుకు నేను వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నను . ఇదే విధానం తీవ్రవాదం, హింసావాదం విషయాలలో కూడా కొనసాగించాలని అనేకమంది సభ్యులు ఇచ్చిన సాంఘిక, ఆర్థిక సూచనలు పరిగణనలోకి తీసుకుని, ఒక ప్రణాళిక ఏర్పాటుచేసే కృషి ప్రభుత్వం పైన ఉందని సభ్యులు గుర్తు చేసిన విషయాన్ని గమనించి, శాఖాపరంగా, ప్రభుత్వ పరంగా మేము కృషి చేయాలని ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటూ, మహామనిషి శ్రీ నర్సిరెడ్డిగారి స్మృతికి నేను శ్రద్ధాంజలి ఘటిస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని , వారి కుటుంబాలని నా సానుభూతి తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను .

MR.SPEAKER : "This House places on record its deep sense of sorrow at the demise of Sri Chittem Narsi Reddy, Member of Andhra Pradesh Legislative Assembly and conveys its deep sense of sympathy to the members of the bereaved family".

Sri Chittem Narsi Reddy was a freedom fighter and a popular leader from Mahaboobnagar District. He was elected from Makthal Assembly Constituency in the General Elections held in 1985, 1989 and 2004. Earlier, he served as a Member in Andhra Pradesh Legislative Council during 1970-76 and 1981-85. At the age of 30, he has been elected as Sarpanch to Dhanwada Village Panchayat and

developed the village in every aspect. He served as President to Dhanwada Panchayat Samithi from 1959 to 1964 and Makthal Panchayat Samithi from 1964 to 1970.

During his present tenure as a Member of Legislative Assembly, he served as Panel Speaker dispassionately and also as a Chairman to the House Committee on I-Max Theatre. As a public representative and as an outspoken leader, Sri Chittem Narsi Reddy worked hard for the betterment and the welfare of ryots and backward classes.

On 15th August, 2005, he succumbed to the bullets of extremists. He was 76 years old. As a mark of respect to the departed leader, let us observe two minutes silence.

(The House observed silence nem con for two minutes.)

(The Motion then was unanimously adopted by the House.)

The House is adjourned to meet again at 8.30 a.m. on Monday, the 3rd of October, 2005.

(Then the House adjourned at 12.18 p.m. to meet again at 8.30 a.m. on Monday, the 3rd of October, 2005.)